విశాలాంధ్ర

ఏలూరు, పశ్చిమ గోదావరి
కాకినాడ, కోనసీమ
తూర్పుగోదావరి

గురువారం 26 డిసెంబరు 2024 8 పేజీలు

మళ్లీ జన్మభూమి!

- గ్రామస్థాయి నాయకులకు పగ్గాలు
- కూటమి నాయకులకు రాజకీయ ఉద్యోగాలు
- గుణపాఠం నేర్వపోతే పాతకథే

విశాలాంధ్ర బ్యూరో-ఏలూరు: జన్మభూమి...ప్రజల వద్దకు పాలన... ఆదరణ...ఇవన్నీ మనకు బాగా పరిచయమైన పదాలే. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అమలు చేసిన పథకాలు. అందులో ముఖ్యమైనది జన్మభూమి. 2014 నుండి 2019 వరకు జరిగిన టిడిపి పాలనలో జన్మభూమి కమిటీలు అత్యంత ప్రాధాన్యతగా నిలిచాయి. జన్మభూమి కమిటీ ఫైనల్ చేసిందే అమలు జరిగేది. ఒకరకంగా అది టిడిపి నాయకులకు మంచిగా అనిపించినా.. ప్రతిపక్షాలకు మాత్రం పలు విమర్శలకు అవకాశం లభించింది. అర్హులైన లబ్దిదారులకు పథకాలు అందాలంటే జన్మభూమి కమిటీ ఎంపిక చేసిన జాబితాలో వారి పేరు ఉండాలి. ఈ విధానం వలన కొంతమంది అర్హులకు పథకాలు అందలేదనే విమర్శలు వచ్చాయి. మళ్లీ ముఖ్యమంత్రి చంద్రబాబు జన్మభూమి కార్యక్రమాలను ప్రారంభించాలని భావిస్తున్నారు. ప్రారంభిస్తే ప్రారంభించనీ.. కానీ కార్యక్రమంలోని పాత అనుభవాలను గుణపాఠంగా తీసుకోకపోతే పాత కథ పునరావృతం అవుతుందని రాజకీయ విశ్లేషకులు భావి స్తున్నారు.

జన్మభూమి కమిటీల పునరుద్దరణ

వచ్చే సంక్రాంతి తర్వాత రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం జన్మభూమి కార్యక్రమాన్ని పునరుద్ధరించడానికి చంద్రబాబు కసరత్తు చేస్తున్నా రని సమాచారం. గతంలో ఈ కార్యక్రమం ద్వారా ప్రజా సమస్యలను తెలుసుకొని వీలైనంతవరకు త్వరగా పరిష్కరించడం, అందుకోసం స్థానికంగా ఉన్న నాయకులను భాగస్వాములను చేయడం.. ఇవన్నీ కొంతవరకు మంచి ఫలితాలని ఇచ్చాయి. కానీ జన్మభూమి కమిటీల ఏర్పాటు విషయంలో కొన్నిచోట్ల పలు విమర్శలను కూడా టిడిపి మూట గట్టుకుంది.ప్రతి గ్రామపంచాయతీకి ఒక జన్మభూమి కమిటీని ఏర్పాటు చేస్తే.. అప్పట్లో ఎవరికి ఏ పథకం అందాలన్నా అర్హతతో పాటు రాజకీయ పలుకుబడి కూడా అవసరమయ్యేదనే విమర్శలు వచ్చాయి. దీంతో అర్హులైన లబ్దిదారులు ప్రభుత్వ పథకాల కోసం ముందుగా జన్మభూమి కమిటీని ప్రసన్నం చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడేది. 2019 ఎన్నికలకు ముందు కొన్నిచోట్ల జన్మభూమి కమిటీలు చేసిన ఓవరాక్షన్ ఆ పార్టీకి చేటు తెచ్చింది.గ్రామంలో పెత్తనం మొత్తం జన్మభూమి కమిటీ చేతిలోకి వెళ్లడంతో ఆ కమిటీ ఆడిందే ఆట...పాడిందే పాటగా కూడా మారింది. చివరకు 2019 ఎన్నికల నాటికి ప్రతిపక్షాలకు జన్మభూమి మంచి విమర్శనాస్త్రం అయ్యింది.

గ్రామస్థాయి నాయకులకు మళ్లీ పగ్గాలు

ముఖ్యమంత్రి చంద్రబాబు మదిలో ఉన్న జన్మభూమి కార్యక్రమాన్ని అమలు చేస్తే ప్రతి గ్రామంలోనూ ఏర్పాటయ్యే జన్మభూమి కమిటీల ద్వారా గ్రామస్థాయి నాయకులకు పగ్గాలు అందనున్నాయని పలువురు సంబరపడుతున్నారు. పార్టీని నమ్ముకున్న వాళ్లు తాము అభిమానించే పార్టీ అధికారంలోకి రావాలనుకుని కోరుకోవడం తప్పుకాదు. కానీ వచ్చిన తరువాత అధికార పగ్గాలు ▶మిగతా 2లో..

నేటి నుంచి సీపీఐ శతాబ్ది ఉత్సవాలు

కార్యాలయాలు ముస్తాబు

విశాలాంధ్ర-ఏలూరు: పేదలకు అండగా నిలిచిన సిపిఐ శతాబ్ది ఉత్సవాలు నేటి నుండి ఏలూరు జిల్లాలో ప్రారంభం కానున్నాయి .భారత కమ్యూనిస్టు పార్టీ 100 సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా సిపిఐ ఏలూరు జిల్లా కార్యాలయం ముస్తాబైంది. విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఈ సందర్భంగా సిపిఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలో కీలకపాత్ర పోషించి కార్మికులకు,కర్షకులకు,అండగా నిలిచి,రైతాంగ పోరాటాలలో అగ్ర భాగాన ఉండి,భూ పోరాటాల ద్వారా లక్షలాది మంది పేదలకు భూములు అప్పగించిన ఘనత సీపీఐది అన్నారు. సిపిఐ ఆవిర్భవించి వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా జిల్లాలో సభలు, ▶మిగతా 2లో..

నాణ్యతతో రోడ్ల నిర్మాణం

మంత్రి దుర్గేష్ వెల్లడి

విశాలాంధ్ర - నిడదవోలు : రోడ్ల నిర్మాణంలో నాణ్యత పాటిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా సంక్రాంతి నాటికి గుంతలు లేని రహదారులే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకెళ్తోందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. బుధవారం నిడదవోలు పట్టణంలోని స్థానిక అంబేద్కర్ చౌక్ వద్ద గుంతల రహిత ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో మంత్రి కందుల దుర్గేష్ పాల్గొని రోడ్డు పనులను ప్రారంభించారు. స్వయంగా ప్రొక్లైన్ నడుపుతూ పనులు ప్రారంభించిన మంత్రి దుర్గేష్ రూ.45 లక్షల అంచనా వ్యయంతో నిడదవోలు పురపాలక సంఘ పరిధిలోని బి.టి రోడ్డు, సి.సి రోడ్ల మరమ్మతు పనులను స్థానిక అధికారులు, కూటమి నేతలతో కలిసి ఈ మేరకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా దుర్గేష్ మాట్లాడుతూ ఇప్పటికే నియోజకవర్గానికి రూ. 11 కోట్ల నిధులు తీసుకొచ్చామని, రాబోయే రోజుల్లో నిడదవోలు పట్టణాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్తామని హామీ ఇస్తూ ఆ దిశగా కృషి చేద్దామని మంత్రి పిలుపునిచ్చారు. ఖజానాలో డబ్బులు లేనప్పటికీ ప్రయాణికులకు ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో గుంతలు పూడ్చే కార్యక్రమం చేపట్టామని మంత్రి అన్నారు. రాబోయే రోజుల్లో వీటిని పక్కా రోడ్లుగా వేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. రోడ్ల నిర్మాణాల విషయంలో స్థానిక భవన కార్మికులకు ఉపాధి కల్పించాలని సూచించారు. రానున్న కాలంలో రూ. 30 కోట్లతో రోడ్లపై ప్రత్యేక దృష్టి పెట్టి పూర్తి ▶మిగతా 2లో..

సీపీఐ శత వార్షికోత్సవాలను జయప్రదం చేయండి

రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డేగా ప్రభాకర్

విశాలాంధ్ర-ఏలూరు: ఈనెల 26 నుంచి జరగనున్న సీపీఐ శత వార్షికోత్సవాలను జయ ప్రదం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్ పిలుపునిచ్చారు.బుధవారం స్థానిక సీపీఐ ఏలూరు జిల్లా కార్యాలయం స్ఫూర్తి భవనంలో సీపీఐ ఏలూరు ఏరియా సమితి ఆధ్వర్యంలో శత వార్షికోత్సవాల గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డేగా ప్రభాకర్ మాట్లాడుతూ దేశంలో సామ్యవాద వ్యవస్థ స్థాపన కోసం 1925 డిసెంబర్ 26న ఆవిర్భవించిన

సీపీఐ ఈనెల 26వ తేదీ నాటికి 100వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా వాడ వాడలా సభలు, సమావేశాలు నిర్వహించి దేశంలో, రాష్ట్రంలో, జిల్లాలో ప్రజల సమస్యల పరిష్కారం కోసం సీపీఐ చేసిన పోరాటా లను ప్రజలకు వివరించడం ద్వారా పార్టీ వైపు దృష్టి సారించే విధంగా ప్రయత్నం చేస్తూ విస్తృతంగా ప్రచారం నిర్వహించాలన్నారు. దేశాన్ని మతోన్మాదులు పాలిస్తున్నారని, మతోన్మాదాన్ని రెచ్చగొడుతూ లౌకికవాదానికి తూట్లు పొడుస్తున్నారని విమర్శించారు.లోక్ సభ సాక్షిగా రాజ్యాంగాన్ని గౌరవిస్తామంటూనే హోం మంత్రి అమిత్ షా, ▶మిగతా 2లో..

పడకేసిన ఆధార్ సేవలు

విశాలాంధ్ర - సీతానగరం: గ్రామ సచివాలయాల్లో ఆధార్ సేవలు పడకేసాయి. మండల వ్యాప్తంగా ప్రజల ఇబ్బందులు తొలగించడానికి పై అధికారుల ఆదేశాల మేరకు నాలుగు ఆధార్ సేవా కేంద్రాలను కేటాయించారు. బొబ్బిల్లంక, ముగ్గుళ్ళ, సింగవరం, చినకొండేపూడి గ్రామ సచివాలయాల్లో ఆధార్ సేవా కేంద్రాలను ప్రారంభించారు. ఆ తర్వాత దానిలో మూడు కేంద్రా లను మునికూడలి, ఇనుగంటివారి పేట, ఉండేశ్వరపురం గ్రామ సచివాలయాల్లోకి మారుస్తూ పై అధికారులు ఆదేశాలను జారీ చేశారు. చినకొండేపూడి ఆధార్ సేవ కేంద్రాన్ని యథావిధిగా

కొనసాగిస్తున్నారు. వీటిలో ఒకటైనా చినకొండేపూడి ఆధార్ సేవ కేంద్రం పని చేస్తూ ఉండేది కానీ ఇప్పుడు డిజిటల్ అసిస్టెంట్ సునీల్‌కు అదనపు బాధ్యతల క్రింద పంచాయతీ కార్యదర్శి విధులు అప్పగించడంతో అక్కడ కూడా ప్రజలకు సేవలు నిలిచిపోయాయని ప్రజలు విమర్శిస్తు న్నారు. మార్చిన మూడు ఆధార్ సేవా కేంద్రాలు ప్రజలకు నేటికీ అందుబాటులోకి రాకపోవడం వల్ల ఆధార్ సేవల కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రభుత్వ ఆధార్ సేవా కేంద్రాలు అందుబాటులో లేకపోవడం వల్ల ప్రయివేటు ఆధార్ సేవా కేంద్రాలపై ఆధారపడాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయని ప్రజలు వాపోతున్నారు. దీనిపై అధికా రులు స్పందించి ప్రజా జీవితంలో ముఖ్య పాత్ర పోషిస్తున్న ఆధార్ సేవా కేంద్రాలను ప్రజలకు పూర్తి స్థాయిలో అందుబాటులోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు.

రు. 20 లక్షలతో సిసి రహదారి నిర్మాణ పనులు

విశాలాంధ్ర -కామవరపుకోట: కామవరపుకోట మండలం రామన్నపాలెం పంచాయతీ మారుతీ నగర్లో రూ.20 లక్షలతో సీసీ రహదారి నిర్మాణ పనులను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు తెదేపా నాయకులు

మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో రహదారులు అధ్వానంగా తయారయ్యా యన్నారు. కూటమి ప్రభుత్వ అధికారంలో వచ్చిన కొద్ది నెలల్లోనే రహదారులకు మహర్దశ పట్టుకోవడంతో ప్రజల హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు.రాబోయే కాలంలో కూటమి ప్రభుత్వంతో మరింత అభివృద్ధి జరగడం ఖాయమన్నారు.ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు కిలారు సత్యనారాయణ,మాజీ ఏఎంసీ చైర్మన్ కోనేరు వెంకట సుబ్బారావు,మాజీ ఎంపీపీ మద్దిపోటి నాగేశ్వరరావు,నెక్కలకు గంగాధర్,జాలపర్తి రాంబాబు,మద్ది పోటి లింగేశ్వరరావు,వడ్లమూడి సత్యనారాయణ,గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

జనసేనలోకి చేరికలు

విశాలాంధ్ర – గణపవరం: ప్రజల కోసం చిత్తశుద్ధి అంకితభావం దృఢ సంకల్పంతో నిత్యం శ్రమిస్తున్న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ నాయకత్వాన్ని మెచ్చుకొని వైయస్సార్ పార్టీ నుండి జనసేన పార్టీలోకి చేరుతున్నారని ఉంగుటూరు శాసనసభ్యులు పత్సమట్ల ధర్మరాజు అన్నారు.

బుధవారం గణపవరం గ్రామంలో సుర్నేశ్వర స్వామి గుడి సమీపంలో ఏర్పాటు చేసిన వేదిక వద్ద వైసీపీ నుండి జనసేన పార్టీలోకి ఎమ్మెల్యే ధర్మరాజు ఆధ్వర్యంలో భారీగా చేరికలు జరిగాయి. సుమారు 70 మంది వైసీపీ నేతలు జనసేన పార్టీలో చేరారు.ఈ కార్యక్రమంలో క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ వాసు రాజు, వంగా రఘు, తోట శ్రీను, నిమ్మల దొరబాబు, రత్తయ్య,జనసేన ముఖ్య నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలు, జనసైనికులు, తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు చీరల పంపిణీ

విశాలాంధ్ర-ఏలూరు: మహిళలలో ఎంతో సమర్థత, నైపుణ్యం ఉంటుందని, అటువంటి మహిళలు అతివలుగా మిగిలిపోకూడదని టిడిపి ఎస్.సి.సెల్ రాష్ట్ర ఉపాధ్య క్షులు జాలా బాలాజీ పేర్కొన్నారు. క్రిస్టమస్ పండు గను పురస్కరించు కొని స్థానిక మూడవ డివిజన్‌లో పేద,వృద్ధ మహిళలకు చీరలు పంపిణీ

చేశారు.ఈ సందర్భంగా బాలాజీ మాట్లాడుతూ క్రిస్టమస్ పండుగ సందర్భంగా సోదరుడిగా పుట్టింటి సారెను బహుమతిగా ఇస్తున్నానన్నారు. కూటమి ప్రభుత్వం మహిళలకు అన్ని రంగాలలో సముచిత స్థానం కల్పిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి 3వ డివిజన్ అధ్యక్షులు చనపతి వెంకటరమణ, యు.రూపేష్, కలిదిండి సతీష్ రాజు,ఎస్.కె. మస్తాన్, తదితరులు పాల్గొన్నారు.

భారత్ కోసం వాజ్‌పేయి జీవితం అంకితం చేశారు

విశాలాంధ్ర – గణపవరం: భారతదేశం కోసం మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి జీవితాన్ని అంకితం చేశారని వర్తక సంఘం ఉపాధ్యక్షులు వంకాయల రామారావు అన్నారు. బుధవారం గణప వరం శ్రీ కన్యకా పరమేశ్వరి వర్తక సంఘం ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం నిర్వహించే కార్యక్రమాలలో మాజీ ప్రధాన మంత్రి వాజ్‌పేయి శత

జయంతి సందర్భంగా వర్తక సంఘ భవనం ఆర్చి గేటు వద్ద ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన దేశానికి చేసిన గొప్ప పనులను స్మరించుకుంటూ ధైర్యసాహసాలను ఓర్పును కార్యాచరణను యువత ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగితే దేశ భవిష్యత్తు బాగుంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో వర్తక సంఘం జాయింట్ సెక్రటరీ ఉప్పల నాగేశ్వరరావు, సున్నా ధ్యాన మండలి అధ్యక్షురాలు విజయలక్ష్మి, రామకృష్ణంరాజు, మహిళలు, పురజనులు తదితరులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా

డీఎస్పీ శ్రావణ్ వెల్లడి

విశాలాంధ్ర ప్రతినిధి- ఏలూరు : అసాంఘిక కార్యకలాపాల నిర్వహణపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడంతో పాటు అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఏలూరు డిఎస్పి శ్రావణ్ కుమార్ హెచ్చరించారు. ఏలూరు నగరంలో గుట్టుచప్పుడు కాకుండా నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై దాడి చేసి 32 మందిని అరెస్టు చేయడంతో పాటు ఎనిమిది లక్షల పదివేల రూపాయలు నగదును ఏలూరు రూరల్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు బుధవారం ఏలూరులోని రూరల్ పోలీస్ స్టేషన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డిఎస్పి డి.శ్రావణ్ కుమార్ రూరల్ ఎస్సై కె. దుర్గాప్రసాద్ తో కలిసి వివరాలు వెల్లడించారు. ఏలూరు నగరంలోని ఎస్ఎంఆర్ నగర్ ప్రాంతంలో పాటూరి త్రినాథ్ కు సంబంధించిన రేకుల షెడ్డు ఇంట్లో పేకాట శిబిరం నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివ కిషోర్ కు అందరి సమాచారం మేరకు ఎస్పి ఆదేశాలతో ఏలూరు డిఎస్పి శ్రావణ్ కుమార్ పర్యవేక్షణలో వన్‌టౌన్ సీఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో రూరల్ ఎస్సై దుర్గాప్రసాద్ తన సిబ్బందితో పేకాట శిబిరంపై దాడి చేసి నిర్వాహకులైన పిల్లల వెంకటేష్ అలియాస్ గుట్కాలు, కొత్తపేట ప్రాంతానికి చెందిన పెద్ది శ్రీను, దెందులూరు గ్రామానికి చెందిన నందమూరి వెంకటరత్నం తో కలిపి మొత్తం 32 మందిని అరెస్టు చేయడంతో పాటు 8 లక్షల 10 వేల రూపాయల నగదు, 25 సెల్ ఫోన్లు, ఒక ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నారు. కాగా పేకాట శిబిరంలో ప్రముఖులు ఉన్నట్లు జోరుగానే ప్రచారం సాగింది. ఈ పేకాట శిబిరం కొంతమంది రాజకీయ నేతల కనుసన్నల్లో వారి అనుచరులు నిర్వహిస్తున్నట్లు తెలిసింది. అరెస్ట్ చేసిన వారిలో అధికారపార్టీకి చెందిన పలువురు నేతలను తప్పించా రనే గుసగుసలు కూడా బహిరంగంగానే వినిపించాయి.

నిర్మాణం (1వ పేజీ తరువాయి)

చేస్తామన్నారు.. ఇప్పటికే సంబంధిత ప్రణాళికలు తయారు చేసుకొని ముందుకు వెళ్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, వైస్ చైర్ పర్సన్ గంగుల వెంకటలక్ష్మి, కౌన్సిలర్లు, మునిసిపల్ కమిషనర్ కృష్ణవేణి, డీఈ హరిబాబు, కూటమినేతలు కొమ్మిన వెంకటేశ్వరరావు, రంగ రమేష్, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

జయప్రదం చేయండి

(1వ పేజీ తరువాయి)

రాజ్యాంగాన్ని రచించిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్‌ను అవమానించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. దీనికి నిరసనగా సిపిఐ జాతీయ సమితి ఇచ్చిన పిలుపు మేరకు ఈనెల 30వ తేదీన దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈనెల 26 నుండి వచ్చే సంవత్సరం డిసెంబరు 26వ తేదీ వరకు కమ్యూనిస్టు పార్టీ చేసిన పోరాటాలు,ప్రజా సమస్యల పరిష్కారం విస్తృతంగా ప్రజలకు వివరించి 2025 డిసెంబర్ 26వ తేదీన తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జిల్లాలో లక్షలాది మందితో బహిరంగ సభ ద్వారా ఈ శత వార్షికోత్సవాలను ముగిం చాలని సిపిఐ నిర్ణయించినట్లు తెలిపారు. సిపిఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య మాట్లాడుతూ భూమికోసం,భుక్తి కోసం , పేదలకు అండగా నిలిచిన పార్టీ సిపిఐ అన్నారు.దేశ స్వాతంత్ర పోరాటంలో సిపిఐ కీలకపాత్ర పోషించిందని, కార్మిక వర్గానికి అండగా నిలిచి,రైతాంగ పోరాటంలో అగ్రభాగాన ఉంటూ,భూ పోరాటాల ద్వారా లక్షలాది మంది పేదలకు భూములు అప్పగించిన పార్టీ కమ్యూనిస్టు పార్టీ అని పేర్కొన్నారు. సిపిఐ శత వార్షికోత్సవాలను పురస్కరించుకొని జిల్లాలోని అన్ని డివిజన్ లు, నియోజకవర్గాలు,మండల స్థాయిలో గ్రామ గ్రామాన,సిపిఐ పతాకాలు ఆవిష్కరించి, సభలు, సమావేశాల ద్వారా సిపిఐ చరిత్ర, ప్రజా పోరాటాలను వివరించాలని పిలుపు నిచ్చారు. గోడ పత్రిక ఆవిష్కరణలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు బండి వెంకటేశ్వరరావు, ఏలూరు ఏరియా సమితి కార్యదర్శి ఉప్పులూరి హేమ శంకర్, జిల్లా కార్యవర్గ సభ్యులు పుప్పాల కన్నబాబు,చేనేత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కడుపు కన్నయ్య, సీపీఐ ఏలూరు ఏరియా సమితి సహాయ కార్యదర్శి కురెళ్ల వరప్రసాద్,నాగం అచ్యుత్,సాయన బాలు, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

జన్మభూమి (1వ పేజీ తరువాయి)

చేపట్టిన అనంతరం కిందిస్థాయిలో ఉండే ప్రజలను గమనించకుండా ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తే సరైన సమయం చూసి ప్రజలు వేటువేయడం ఆనవాయితీగా మారింది. గతంలో టిడిపికి జన్మభూమి కమిటీల ద్వారా ఇదే నష్టం జరిగిందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. గత వైసిపి పాలనలో వాలంటీర్ వ్యవస్థను అమలులోకి తెచ్చి అప్పటి ముఖ్యమంత్రి జగన్ వాలంటీర్ల ఓవరాక్షన్ తో ఎలా నష్టపోయింది ఆ పార్టీ నేతల కళ్ళ ముందు కనిపించే అంశం అని విశ్లేషకులు వివరిస్తున్నారు. ఈ గుణపాఠాన్ని గుర్తుచేసు కొని జన్మభూమి కార్యక్రమం ప్రజ లకు అండగా నిలబడేలా తీర్చిదిద్దితే మంచి ప్రయోజనాలు కూడా ఇస్తుందని పలువురు చెబుతున్నారు.

కూటమి శ్రేణులకు రాజకీయ ఉద్యోగాలు

గతంలో చాలా కాలం నుంచి టీడీపీ ఒంటరిగా...ఆ తర్వాత వామపక్షాల పొత్తుతో అధికారంలోకి వచ్చిన దాఖలాలు ఉన్నాయి. ప్రస్తుత సంవత్సరం ఎన్నికలలో ప్రత్యేక పరిస్థితులలో టిడిపి,జనసేన బిజెపి,పార్టీలు కలిసి సంయుక్తంగా వైసీపీపై పోరాడి అధికారాన్ని దక్కించుకున్నాయి.ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబుకు మానస పుత్రికగా గుర్తింపు తెచ్చుకున్న జన్మభూమి కార్యక్రమాన్ని తిరిగి ప్రారంభించాలని భావిస్తున్న నేపథ్యంలో కూటమిలోని జనసేన,బిజెపి పార్టీలు కూడా వచ్చేంతగా ఆలోచిస్తున్నాయి.రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండగా తెలుగుదేశం ప్రభుత్వంలో ప్రాచుర్యం పొందిన జన్మభూమిని తిరిగి ప్రారంభిస్తున్న నేపథ్యంలో తమ పార్టీల ఉనికిని కాపాడుకునే కార్యక్రమాలు ఏవైనా వస్తాయా.. రావా..? అని చర్చించుకుంటున్నారు. ఈ పరిస్థితిలో జన్మభూమి కార్యక్రమం తిరిగి ప్రారంభమైతే కూటమి పార్టీలలోని రాజకీయ నిరుద్యోగు లుగా ఉన్న చాలామందికి రాజకీయ ఉద్యోగ అవకాశాలు లభించే పరిస్థితులు ఉన్నాయనేది బహిరంగ రహస్యం. జన్మభూమి కమిటీలు పారదర్శకంగా పనిచేసేలా తీర్చి దిద్దుకొని మంచి ఫలితాలు వచ్చేలా జాగ్రత్తలు తీసుకుంటే మంచిది.లేదంటే చరిత్ర పునరావృతం అవుతుంది.

క్రీస్తు బోధనలు సర్వ మానవాళికి ఆచరణీయం

ఏలూరులో ఘనంగా క్రిస్మస్ వేడుకలు

విశాలాంధ్ర- ఏలూరు : ఏసుక్రీస్తు ప్రేమ దయ గుణాలు ప్రజలందరి జీవితాలకు మార్గదర్శకమని విజయవాడ జోనల్ చైర్మన్ రెడ్డి అప్పల నాయుడు తెలి పారు. బుధవారం క్రిస్మస్ వేడుకలను నగరంలో

ఘనంగా నిర్వహించారు. పలుచోట్ల జరిగిన ఈ వేడుకలకు ముఖ్య అతిధులుగా ఏలూరు శాసనసభ్యులు బడేటి రాధాకృష్ణయ్య, ఏపీఎస్ఆర్టీసీ జోనల్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు, నగర మేయర్ నూర్జహాన్ పెదబాబు హాజరై ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీస్తు చూపిన ప్రేమ, అనురా గాలు ప్రజల మనుగడను మార్చేశాయని చెప్పారు. ప్రజలందరికీ క్రీస్తు మార్గం అనుసరణీయమని, ప్రజల కొరకు ఆయన ప్రాణ త్యాగం చేశారని వివరించారు. క్రీస్తు మార్గంలో క్రైస్తవ సంస్థలు ఎన్నో ఉచిత విద్య, వైద్య, సామాజిక సేవలు అందిస్తున్నాయని వివరించారు. ఈ సందర్భంగా క్రైస్తవ సోదర సోదరీమణులు అందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపి సంఘస్తులు, దైవజనులు ఫాదర్ లతో కలిసి క్రిస్మస్ కేకును కట్ చేశారు. అనంతరం ఏలూరు మేత్రాసన పీఠాధిపతి, అపోస్తలిక పాలనాధికారి అగ్ర పీఠం, మహాఘన మోస్ట్ రెవ. డా. జయరావు పొలిమేరని, నాగేంద్ర కాలనీలో ఫాదర్ సుభద్రరావు, దుగ్గిరాల లోని జోసెఫ్ డెంటల్ కాలేజీలో ఫాదర్ మోజేష్ ని, గ్జేవియర్ నగర్లోని విశ్వాసపురి జ్ఞాన కేంద్రం మందిరం ఫాదర్ గ్జేవియర్ ని మర్యాద పూర్వకంగా కలిసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు రెడ్డి గౌరీ శంకర్, వీరంకి పండు, జనసేన రవి, ఇద్దుం చిరంజీవి మరియు వివిధ హోదాల్లో ఉన్న నాయకులు, కార్యకర్తలు, భారీ సంఖ్యలో క్రైస్తవ సోదరులు, సంఘ కాపరులు, దైవ జనులు, మత పెద్దలు పాల్గొన్నారు.

శ్రీ చైతన్య పాఠశాలలో : ఏసుక్రీస్తు ప్రబోధించిన శాంతి మార్గంలో పయనించి ఇతరుల పట్ల ప్రేమ, దయాగుణంతో మెలగాలని శ్రీ చైతన్య పాఠశాల ప్రిన్సిపాల్ దుర్గారావు పిలుపునిచ్చారు. స్థానిక విద్యానగర్ లోని శ్రీ చైతన్య పాఠశాలలో ఘనంగా క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. విద్యార్థులు క్రీస్తు

జననానికి సంబంధించి పలు నాటికలు, పాటలు మరియు నృత్యాలు చేసి ప్రదర్శించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ వి.దుర్గారావు మాట్లాడుతూ తోటివారిని ప్రేమించటమే యేసు క్రీస్తు లోకానికి చూపిన మార్గమని చెప్పారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఏలూరు శ్రీ చైతన్య పాఠశాల ఎజియమ్ ఎన్.పార్థసారథి, రిజినల్ ఇన్ఛార్జ్ సిహెచ్.ఉదయ భాస్కర రావు, అకడమిక్ కో-ఆర్డినేటర్ వెంకటేశ్వరరావు, డీన్ వి. లక్ష్మణ్ కుమార్, ఐపిఎల్ ఇన్ఛార్జి ఎస్. సత్యనారాయణ, ప్రైమరీ) ఇన్ఛార్జ్ సిహెచ్. అరుణ, ప్రీ-ప్రైమరి ఇన్ఛార్జి టి.ఝాన్సీ ఉపాధ్యాయులు, విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఉత్సవాలు

(1వ పేజీ తరువాయి)

సమావేశాలు, నిర్వహించి సిపిఐ 100ఏళ్ళ చరిత్ర, పోరాట పటిమ,ప్రజా సమస్యల పరిష్కారం తదితర అంశాలు ప్రజలకు అవగాహన కనిపించే విధంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఈ కార్యక్రమాలకు అభ్యుదయవాదులు, విద్యావంతులు, సిపిఐ అభిమానులు, ప్రజలు పెద్ద ఎత్తున విచ్చేసి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

భవ్య భీమవరంతో అభివృద్ధికి తొలి అడుగు- జేసీ రాహుల్ కుమార్ రెడ్డి

విశాలాంధ్ర -భీమవరం: భవ్య భీమవరం పేరిట భీమవరంలో మౌలిక వసతుల అభివృద్ధికి శరవేగంగా పనులను ప్రారంభించినట్లు జిల్లా జాయింట్ కలెక్టర్, మున్సిపాలిటీ స్పెషల్ ఆఫీసర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు. భవ్య భీమవరం పేరుతో పట్టణంలో చేపట్టిన అభివృద్ధి పనులకు జాయింట్ కలెక్టర్ శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సారథ్యంలో అధికారులు, దాతలు తొలి అడుగు వేశారని తెలిపారు. జిల్లా కలెక్టర్ భీమవరం అభివృద్ధికి నిరంతర ఆలోచన చేసి అధికారులను, దాతలను ప్రోత్సహిస్తూ ఇప్పటికే పలు దఫాలుగా సమావేశపరిచి చర్చించినట్లు తెలిపారు. దాని ఫలితంగా నేడు తొలి విడతలో నాలుగు అభివృద్ధి పనులను శంకుస్థాపన చేసుకున్నామని జాయింట్ కలెక్టర్ అన్నారు. ఇప్పుడు జరుగుచున్న అభివృద్ధి పనులకు "భవ్య భీమవరం" పేరును జిల్లా కలెక్టర్ స్వయంగా ఖరారు చేసి ప్రోత్సహించారన్నారు. ఇది తొలి విడత మాత్రమేనని పనులు కొంత పురోగతి లోకి వచ్చిన తర్వాత మరిన్ని అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసుకోవడానికి ప్రణాళికలను సిద్ధం చేసినట్లు తెలిపారు. రెండో దశలో ప్రకాశం చౌక్, అంబేద్కర్ చౌక్, ఈట్ స్ట్రీట్, ఖాళీ ప్రాంతాల్లో పచ్చదనం అభివృద్ధి, జువ్వలపాలెం రోడ్డు ఎస్ఆర్ కే కాలేజీ వరకు, తదితర అభివృద్ధి పనులను చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమాల్లో కాస్మోపాలిటన్ క్లబ్ ప్రెసిడెంట్ అల్లూరి పద్మరాజు, ఆనంద ఫౌండేషన్ చైర్మన్ కాశీ విశ్వనాథరాజు, లైన్ ఇంటర్నేషనల్ సిహెచ్ కృష్ణంరాజు, రామభద్రరాజు టెస్ట్ అధ్యక్షులు చేకూరి రామభద్రరాజు, జిల్లా రైస్ మిల్లర్స్ అసోసి యేషన్ అధ్యక్షులు సామంతపూడి శ్రీరామరాజు తదితరులు పాల్గొన్నారు.

శ్రీనివాసరావు మృతికి పలువురు సంతాపం

విశాలాంధ్ర-టి నరసాపురం: కొయ్యలగూడెం మండల సిపిఐ కార్యదర్శి జమ్మి శ్రీనివాసరావు మృతికి ఏఐటీయూసీ చింతలపూడి ఏరియా గౌరవాధ్యక్షులు టీవీఎస్ రాజు, అభ్యుదయ రచయితల సంఘం రాష్ట్ర కార్యదర్శి బొల్లినేని నాగార్జునసాగర్ మంగళవారం ఒక ప్రకటనలో ప్రగాఢ సంతాపం తెలిపారు. 2003 సంవత్సరంలో సిపిఐ సభ్యత్వం స్వీకరించిన శ్రీనివాస్ యువజన సమైక్య కార్యకర్తగా ప్రజా ఉద్యమానికి శ్రీకారం చుట్టారని, అంచెలంచెలుగా మండల కార్యదర్శిగా, జిల్లా కార్యవర్గ సభ్యునిగా ఎదిగారని తెలిపారు. కొయ్యలగూడెం మండలంలోని రాజవరం, ఎర్రంపేట ,స్వగ్రామమైన మంగపతిదేవిపేట, బోడిగూడెం, చొప్పరమ్మన్న గూడెం, పలు గ్రామాలలో భూ పోరాటాలు నిర్వహించి ఇల్లు లేని పేదలకు ఇల్లు స్థలాలు కోసం పోరాటాలకు నాయకత్వం వహించారన్నారు. ఆయన మృతికి మండలంలోని మక్కినవారి గూడెం ఏరియా ముఠావర్కర్స్ యూనియన్ ఉపాధ్యక్షుడు కొండముచ్చు శ్రీనివాసరావు, సీనియర్ నాయకుడు మల్లుల సత్యనారాయణ, సిపిఐ సీనియర్ నాయకులు పరిమి పేర్రాజు, షేక్ జాకీర్ హుస్సేన్, జానపద కళాకారులు వీరమల్ల సత్యనారాయణ, బచ్చు నందకుమార్ తదితరులు సంతాపం తెలుపుతూ ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఏలూరు జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా రాజకృష్ణ

విశాలాంధ్ర - ఏలూరు : ఏలూరు జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఆర్. రాజకృష్ణ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఇప్పటివరకు తణుకు కళాశాల ఇంచార్జ్ ప్రిన్సిపాల్‌గా పనిచేశారు. అనంతరం కళాశాల అధ్యాపకులు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందించారు. సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతూ సిబ్బందితో కలసి ఉన్నత అధికారుల సలహాలు తీసుకొని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ ప్రిన్సిపాల్ విశ్వనాథ,స్టాఫ్ మురళీకృష్ణ, ఓవి శ్రీనివాస్, జనార్దనరావు, మల్లికార్జునరావు,చంద్రావతి, భారతి, అధ్యాపకులు, కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వెలుగు సంఘాల వీవోఏలపై రాజకీయ ప్రభావం

- ఇష్టం ఉన్నవారికి ఒక న్యాయం... ఇష్టం లేని వారికి మరో న్యాయమా?
- లక్షలు కాజేసిన వీవోఏ నుంచి రికవరీ ఏది?
- లింగపాలెం మండల వెలుగు సంఘాల వ్యవహారంపై సర్వత్రా చర్చ

విశాలాంధ్ర-లింగపాలెం: వెలుగు పొదుపు సంఘాలలో పని చేస్తున్నా గ్రామ ఆర్గనైజింగ్ అసిస్టెంట్ల కొందరి తొలగింపు వ్యవహారం లింగపాలెం మండలంలో వివాదాస్పదంగా మారింది. మండలంలో పనిచేస్తున్న 11 మంది వివోఏ లను తొలగించాలని రాజకీయ నాయకుల నుంచి ఒత్తిడి పెరగటంతో ఈ వ్యవహారం వివాదా స్పదంగా మారింది. మండలంలో 1560 మహిళా సంఘాలు ఉన్నాయి. ఈ సంఘాలలో 15,600 మంది మహిళలు సభ్యులుగా ఉన్నారు. 16 సంఘాల నుంచి 30 సంఘాలకు ఒక వి.ఓ.ఏ పర్యవేక్షకురాలుగా ఉంటారు. వివోఏ ఆధ్వర్యంలో సంఘాల నిర్వహణ ఉంటుంది. మండలంలో వేల మంది మహిళలు సభ్యులుగా ఉన్న ఈ సంఘాల సభ్యులందరూ వివోఏలపై ఆధారపడి ఉంటారు. వెలుగు మహిళా సంఘాలకు ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం అధికంగా ఉంది. మహిళలు ఆర్థికంగా బలపడటానికి సంఘాలు దోహదపడుతున్నాయి. సంఘం పనితీరు, రుణాల చెల్లింపును పరిగణ లోకి తీసుకొని ఒక్కొక్క సంఘానికి బ్యాంకుల నుంచి రూ.20 లక్షల వరకు రుణాలు ఇస్తున్నారు. ఈ బాధ్యతలన్నిం టినీ వివోఏలే చూస్తుంటారు. వెలుగు సంఘాల పొదుపు స్కీము పథకం 2004లో అమల్లోకి వచ్చింది. గతంలో ఎన్నడూ లేని విధంగా పొదుపు సంఘాల పై పర్యవేక్షణ చేస్తున్న వివోఏ లపై రాజకీయ ప్రభావం పడింది. సహ జంగా సంఘాల పర్యవేక్షణలో కొన్ని లోటుపాట్లు జరుగుతూనే ఉంటాయి. గ్రామ సంఘం, మండల స్థాయి సంఘ పరిధిలో చర్చించుకొని సర్దుబాట్లు చేసుకోవటం జరుగుతూ వస్తుంది. అయితే ఈసారి మాత్రం మండలంలో 11మంది వివోఏలను తొలగించాలని రాజకీయ ఒత్తిడి పెరగడంతో వివాదాస్పదంగా మారింది. ఏళ్ల తరబడి తాము వివోఏలుగా పనిచేస్తుంటే తమను తొలగించి ఈ స్థానంలో వేరే వారిని పెట్టుకుంటున్నా రని వీరు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాము పొరపాట్లు చేస్తే పనిష్మెంట్ ఇవ్వాలేగాని తొలగించటం ఏంటనే ప్రశ్న తలెత్తుతున్నది. తొలగించబడిన వారు తమకు న్యాయం చేయాలని న్యాయస్థానాన్ని ఆశ్రయిం చారు. న్యాయస్థానం తీర్పు ప్రకారం గ్రామ కమిటీల ఆదేశాను సారం వివోఏల పనితీరును బేరీజు వేసుకుని నిర్ణయం తీసుకోవాలని తీర్పు ఇచ్చారని వెలుగు సంఘాల నాయకులు వెల్లడించారు. వివోఏలకు నెలకు రూ.8 వేలు గౌరవ వేతనంగా ఇస్తున్నారు. మండలంలో 55 మంది వివోఏలు ఉన్నారు. వీరందరూ ఇదే జీవనోపాధిగా పని చేస్తున్నారు. గౌరవ వేతనంతో విధులు నిర్వహించే వారిపై రాజకీయ ప్రభావం పడటం ఇష్టం ఉన్న వారిపై ఒకలా, ఇష్టం లేని వారిపై మరోలా వ్యవహ రించటం తీవ్ర చర్చనీయాంశం అయ్యింది.

డబ్బు కాజేసిన వివోఏపై చర్యలేవి?

మండలంలోని మఠంగూడెం పంచాయతీ లోని శివారు గ్రామమైన చంద్రన్నపాలెంలో ఒక వివోఏ రూ.25లక్షలు డబ్బులు కాజేసింది. ఈ సంఘటనపై ఇప్పటివరకు అధికారులు గానీ, పాలకులు గాని ఎటువంటి చర్యలు తీసుకోలేదు. బ్యాంకులో చెల్లించాల్సిన నగదును వివోఏ కాజేసింది. దీనిపై మహిళా సంఘ సభ్యులు ఆందోళనలు చేసి కేసులు పెట్టారు. ఈ సంఘటన జరిగి నెలలు గడుస్తున్నా నగదు చెల్లింపు జరగలేదు. లక్షలాది రూపాయలు భారీ మొత్తంలో నగదులు కాజేసిన వివోఏ నుంచి సభ్యులకు నగదు ఇప్పించలేక పోయారు. దీనిపై అనేకమంది ఇదేం న్యాయ మంటూ ప్రశ్నిస్తున్నారు. కొందరు వివోఏల తొలగింపు వ్యవహా రంపై భిన్న వాదనలు వినిపిస్తున్నాయి. తమకు అన్యాయం చేస్తున్నారంటూ తమకు న్యాయం చేయకపోతే ఆందోళన చేపడుతామని తొలగింపునకు గురైన వివోఏలు హెచ్చరిస్తున్నారు. ఈ వ్యవహారం వెలుగు సంఘాల అధికారులకు తలనొప్పిగా మారింది. ఉన్నతాధికారులు దీనిపై స్పందించి తగు నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఈ వ్యవహారం మండలంలో సర్వత్రా చర్చనీయాంశమైంది.

సీపీఐ శత వార్షికోత్సవాలను వాడవాడలా నిర్వహించాలి

సీపీఐ పశ్చిమ గోదావరి జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు

విశాలాంధ్ర -భీమవరం: సీపీఐ శత వార్షికోత్సవాలను పార్టీ శ్రేణులు వాడవాడలా ఘనంగా నిర్వహించి వందేళ్ళ ఉద్యమ పోరాట చరిత్ర వివరించాలని సీపీఐ పశ్చిమ గోదావరి జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు పిలుపు నిచ్చారు. బుధవారం భీమవరంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో సీపీఐ శత వార్షికోత్సవాల వాల్ పోస్టర్‌ను పార్టీ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా భీమారావు మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యోద్యమ పోరాటంలో వందలాది మంది కమ్యూనిస్టులు తమ ప్రాణాలు కోల్పోయారన్నారు. భూమి కోసం, భుక్తి కోసం, శ్రమ జీవుల బానిసత్వ విముక్తి కోసం సాగిన తెలంగాణ సాయుధ పోరాటంలో నాలుగున్నర వేల మంది కమ్యూనిస్టులను కాల్చి చంపారన్నారు. ఖలిస్తాన్ తీవ్రవాద వ్యతిరేక పోరాటంలో 200 మంది, జిల్లాలో జరిగిన జమిందారీ వ్యతిరేక రైతాంగ పోరాటంలో 18 మంది కమ్యూనిస్టులు తమ ప్రాణాలను తుపాకీ గుళ్ళకు అర్పించారన్నారు. ప్రజల జీవనోపాధి, ఆర్థిక సమానత్వం, సామాజిక న్యాయం,దోపిడీ రహిత సమాజ సాధన దిశగా వందేళ్ళుగా సీపీఐ నిర్విరామంగా పోరాడుతుందన్నారు. దున్నేవానిదే భూమి అంటూ సీపీఐ సాగించిన పోరాటఫలితంగా పేదలకు లక్షలాది ఎకరాలు



భూమి పంపిణీ జరిగిందన్నారు. రాజభరణాలు రద్దు, బ్యాంకుల జాతీయకరణ సీపీఐ పోరాట ఫలితమేనన్నారు. ప్రస్తుత నరేంద్రమోదీ మతతత్వ, కార్పొరేట్ అనుకూల రైతాంగ, కార్మిక, ప్రజా వ్యతిరేక పాలనకు వ్యతిరేకంగా మతసామరస్య సాధనకు, లౌకిక రాజ్యాంగ పరిరక్షణ, ప్రజాస్వామ్య పరిరక్షణకు సీపీఐ ఎదురొడ్డి నిలచి పోరాడుతుందన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చెల్లబోయిన రంగారావు, ఎం.సీతారాం ప్రసాద్, జిల్లా సమితి సభ్యులు మల్లుల శ్రీనివాస్, యేలేటి విజయానంద్, విద్యార్థి నాయకుడు వై.జోయల్ తదితరులు పాల్గొన్నారు.

కోడిపందాలు వేస్తున్న వారిపై దాడులు

విశాలాంధ్ర-లింగపాలెం: భోగోలులో కోడిపందాలు వేస్తున్న వారిపై ధర్మాజీగూడెం ఎస్ఐ వెంకన్న తమ సిబ్బందితో దాడి చేసి పట్టుకున్నారు.

ఈ దాడిలో ఆరుగురు వ్యక్తులు పట్టుబడుగా వీరి నుంచి ఒక పుంజు, రూ.1250లు నగదును స్వాధీనం చేసుకున్నారు.

పట్టుబడిన వారిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

బుర్రకథ కళాకారుడు తిప్పర్తి వీరబ్రహ్మాచారికి పలువురు నివాళులు

విశాలాంధ్ర-టి నరసాపురం: కళనే ఆయుధంగా, కళే జీవితంగా దశాబ్దాల పాటు బుర్రకథ కళాకారుడిగా కళామతల్లి ముద్దుబిడ్డగా తన యావత్ జీవితాన్ని బుర్రకథ కళా రంగానికి అంకితం చేసిన తిప్పర్తి వీర బ్రహ్మచారి లాంటి కళాకారుల ఆశలను ఆశయాలను కొనసాగించడమే కళాకారుల నిజమైన నివాళులని ఏపీ ప్రజానాట్యమండలి ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా గౌరవ అధ్యక్షుడు సీనియర్ బుర్రకథ కళాకారుడు సబ్బి కనకారావు అన్నారు. బొర్రంపాలెం గ్రామంలో తిప్పర్తి వీర బ్రహ్మచారి వర్ధంతి ప్రముఖ బుర్రకథ కళాకారుడు వీరమల్ల సత్యనారాయణ అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీ ప్రజానాట్యమండలి ఏలూరు జిల్లా సబ్ కమిటీ కన్వీనర్ టీవీఎస్ రాజు మాట్లాడుతూ సీనియర్ బుర్రకథ కళాకారులదు మామిళ్లపల్లి సుబ్బారావు శిష్యులుగా సరస్వతీ బుర్రకథ కళాకారుడుగా, రాజకీయ వ్యాఖ్యాతగా తిప్పర్తి వీర బ్రహ్మచారి ఎన్నో దశాబ్దాలు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లోనూ వివిధ ఉత్సవాల్లోనూ ప్రభుత్వం నిర్వహించే సభలో సమావేశాలను బుర్రకథలు చెప్పి హాస్యపు జల్లులు కురిపించి ప్రజల ఆశీస్సులు పొందారన్నారు. బ్రహ్మచారితో తాను కూడా ఐసిడిఎస్ వారు నిర్వహించిన ఆరోగ్య సూత్రాలు, పోషక ఆహార విలువలు, కుటుంబ నియంత్రణ తదితర అంశాలపై జరిగిన ప్రచార జాతాల్లో పాల్గొన్నానని గుర్తు చేశారు. కంజరికథ కళాకారులు చిలుకూరి సుబ్బయ్య చారి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బుర్రకథ కళాకారులు షేక్ శుభాన్ బాబు, ఫ్రాన్సిస్ బ్రహ్మచారి కుటుంబీకులు, అభిమానులు పలువురు పాల్గొన్నారు.

కృష్ణంరాజును మర్యాదపూర్వకంగా కలిసిన గౌడ సంఘం నాయకులు

విశాలాంధ్ర- పాలకోడేరు : పశ్చిమగోదావరి జిల్లా డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన కునాధరాజు మురళీ కృష్ణంరాజును పాలకోడేరు మండల గౌడ సంఘం నాయకులు బుధవారం ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలుసుకొని పుష్పగుచ్ఛం అందించి దుశ్శాలువతో

సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో డెల్టా ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్‌గా మురళి కృష్ణంరాజును ఏకగ్రీవ ఎన్నికకు సహకరించిన ఉండి శాసనసభ్యులు రఘురామ కృష్ణంరాజుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో మురళి కృష్ణంరాజు మరిన్ని పదవులు పొందాలని ఆకాంక్షించారు. తనను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేసిన గౌడ సంఘం నాయకులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ మురళి కృష్ణంరాజు తెలిపారు. కార్యక్రమంలో మండల గౌడ సంఘం పెద్దలు, నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

సంత్ సేవాలాల్ మహారాజ్ మందిరం ప్రతిష్ట

విశాలాంధ్ర-టి నరసాపురం: టి నరసాపురం పంచాయతీలోని కృష్ణా పురం గ్రామంలో బంజారా బజరంగీ భేరీ ఆధ్వర్యంలో గోర్ బంజారాల

ఆధ్యాత్మిక దైవం సంత్ సేవాలాల్ మహారాజ్ దివ్య మందిరం ప్రతిష్ఠ బుధవారం ఘనంగా నిర్వహించి మహా భోగ్ జెండా ఆవిష్కరణ చేసి మొక్కులు నాటారు. విగ్రహ దాత భూక్యా నాగమణి దంపతులకు సన్మానించారు.ఈ సందర్భంగా జిల్లా నాయకులు భూక్యా నాగరాజు నాయక్ మాట్లాడుతూ గోర్ బంజారా జాతికి తండా రాజ్యాన్ని స్థాపించి, గోర్ జాతిని చీకటి నుండి వెలుగుల్లోకి తీసుకువచ్చిన సంసర్త, పోరాట యోధుడు సేవాలాల్ మహారాజ్ అని అన్నారు. ప్రధాన కార్యదర్శి భూక్యా వేణు గోపాల్ మాట్లాడుతూ హనుమాన్, హాథిరామ్, సేవాలాల్ బంజారా త్రిమూర్తులు అని, గోర్ బంజారా ధర్మాన్ని పరిరక్షణ కోసం వారి విగ్రహాలను ప్రతి తండాల్లో ప్రతిష్టించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో బాదావత్ లక్ష్మణ స్వామి నాయక్ జరభల చందా నాయక్, ధరావత్ ప్రవీణ్ నాయక్, పూర్ణయ్య నాయక్,భూక్యా బిగనాథం, భద్రయ్య నాయక్, స్వామి నాయక్, ధరావత్ రమేష్, భూక్యా వాలి, హసవత్ వెంకటేశ్వరావు, భూక్యా సుగాలి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

క్రీస్తు మార్గాన్ని అనుసరించాలి

విశాలాంధ్ర-లింగపాలెం: క్రీస్తు మానవాళికి మార్గదర్శకులని ప్రతి ఒక్కరు ఆయనను ఆదర్శంగా తీసుకొని జీవనం సాగించాలని మత గురువులు క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని బోధనలు చేశారు. ప్రజల్లో అసూయ ద్వేషం, పగలు ఉండకూడదని క్రీస్తు చూపించిన మార్గమైన శాంతి, సమాధానం,దయ, కరుణ ఉండాలన్నారు. దీనివల్ల సమాజంలో అసమాన తలు ఉండవని, మంచి సమాజ స్థాపన ఉంటుందని పేర్కొన్నారు. క్రిస్మస్ పండుగను లింగపాలెం మండలంలో క్రైస్తవులంతా ఘనంగా నిర్వహించారు. తుపాను ప్రభావంతో వాతావరణం ప్రతికూలంగా ఉన్నప్పటికీ ప్రతి గ్రామంలోని క్రైస్తవ చర్చలన్నీ విశ్వాసులతో కిటకిటలాడాయి. చర్చిల్లో మత బోధకులు, గురువులుక్రీస్తు సందేశాన్ని వినిపించారు. ఈ సందర్భంగా కేకులు కట్ చేసి, క్యాండిల్స్ వెలిగించి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. క్రైస్తవ విశ్వాసులంతా చర్చిలలో నిర్వహించిన ప్రార్థనలలో పాల్గొన్నారు. క్రీస్తు జన్మదినోత్స వాన్ని పురస్కరించుకొని స్వీట్లు,పండ్లు పంచారు. బాణాసంచా కాల్చారు. ధర్మాజీ గూడెం సి.ఎస్.ఐ దేవాలయంలో పాస్టర్ జగన్మోహన్ రావు, ఆర్.సి.యం చర్చిలో ఫాదర్ గాబ్రియేల్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

భీమడోలు: మండల వ్యాప్తంగా క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి.మంగళవారం అర్ధరాత్రి నుంచి

భీమడోలు మండల గ్రామాల్లోని చర్చిల వద్ద విశ్వాసులు ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. చర్చిల వద్ద చిన్నారులు, యువత నృత్యాలు చేస్తూ క్రీస్తు జననం సందర్భంగా స్వాగతం పలికారు.భీమడోలు ఆర్సీఎం చర్చి, ఆరోగ్యమాత ప్రార్ధనా మందిరం, కల్వరి ప్రార్ధనా మందిరంలో అర్ధరాత్రి నుంచి ప్రారంభమైన క్రిస్మస్ ప్రత్యేక ప్రార్ధనలు బుధవారం తెల్లవారుజాము వరకు అదేవిధంగా ఉదయం 11గంటల నుండి సాయంత్రం వరకు క్రిస్మస్ ప్రార్ధనలు కొనసాగాయి. గుండుగోలను గ్రామంలోని పలు ప్రార్థనా మందిరాలలో సువార్త ర్యాలీలు నిర్వహించారు.

జీలుగుమిల్లి : ఏసుక్రీస్తు మానవాళికి శాంతి ప్రేమ దయ గుణం అందించిన మహనుభావుడని పి అంకంపాలెం ఎంపిటిసి నాలి శ్రీను అన్నారు. బుధవారం కనకాపురం నూతన చర్చి ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన

మాట్లాడుతూ ఏసుక్రీస్తు విశ్వ మానవ సౌభ్రాతృత్వాన్ని నెలకొల్పారని అన్నారు. క్రీస్తు జీవితాన్ని ఆదర్శంగా ప్రతి ఒక్కరు తీసుకోవాలని అన్నారు .చర్చి ఆధ్వర్యంలో నాలి శ్రీనని ఘనంగా సన్మానించారు. అనంతరం కేక్ కట్ చేసి ప్రతి ఒక్కరికి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ములగలంపల్లి సర్పంచ్ రాజు, పాస్టర్ శ్యాంబాబు, చాప వెంకటేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

టి నరసాపురం: మండలంలో క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రార్థన మందిరాల్లో క్రైస్తవ విస్వాసులు క్రిస్మస్ వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ప్రధానంగా మండలంలోని బొర్రం పాలెం, మక్కినవారిగూడెం, మర్రిగూడెం, టి నరసాపురం, పుట్రేపు, ప్రకాష్ నగర్, రుద్రకోటరాజు గూడెం, గండిగూడెం, బంధంచర్ల, బండివారిగూడెం, తెడ్లం,కె జగ్గవరం గ్రామాల్లో పాస్టర్లు, క్రైస్తవ విశ్వాసులు కలిసి క్రీస్తు పుట్టిన సందర్భంగా కేకు కట్ చేసి సంబరాలు నిర్వహించారు. గ్రామాల్లో సువార్త ప్రకటించి కేకులు, సంఘాలలో స్వీట్లు పంచి

ఒకరికొకరు శుభాకాంక్షలు తెలిపారు. వృద్ధులు, వితంతువులకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. యా కార్యక్రమాల్లో పాస్టర్లు జి జ్హాన్ రాజు, కె. నిరీక్షణరావు, సిహెచ్ హెూషేయ, వై. పాల్ చిన్నారావు, సిహెచ్ రమేష్, టి. ప్రసన్నకుమార్, అకుల ప్రసన్న రాజు తదితరులు పాల్గొన్నారు.

పెదవేగి: మైనార్టీల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అన్ని విధాల అండగా ఉంటుందని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ తెలియజేశారు. క్రీస్తు జన్మదినాన్ని పురస్కరించుకొని దుగ్గిరాలలోని క్యాంపు కార్యాలయంలో క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు కూటమి నాయకులతో కలిసి కేక్ కటింగ్ చేసిన చింతమనేని ప్రభాకర్ నియోజకవర్గ ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలోని సాటి మనిషికి సహాయపడుతూ జీవించడమే క్రీస్తు సూచించిన సన్మార్గమని తెలిపారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో మైనార్టీ వర్గాల ప్రజలు ఆకలి బాధలు,దౌర్జన్యాలు,దాడులతో బిగ్గబిక్కుమని

బతికారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత పేదల అభ్యున్నతి ధ్యేయంగా పనిచేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఏలూరు రూరల్ మండలం టీడీపీ అధ్యక్షులు నంబూరి నాగరాజు,క్లస్టర్ ఇంచార్జి నేతల రవి సహ పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాడి పరిశ్రమ బలోపేతమే లక్ష్యంగా గోకులాలు

– రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి

విశాలాంధ్ర- చాట్రాయి : తెలుగుదేశం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పాడిరైతుల సంక్షేమాభివృద్ధి కోసం చర్యలు చేపట్టిందని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి చెప్పారు. బుధవారం మండల కేంద్రమైన చాట్రాయిలో ఉపాధి హామీ పథకం నిధులు రూ.2.30 లక్షలతో నిర్మించిన గోకులం షెడ్డును రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మినీ గోకులం షెడ్ల మంజూరుకు శ్రీకారం చుట్టిందన్నారు. గత వైసీపీ పరిపాలనలో గోకులం షెడ్లను పూర్తిగా విస్మరించిందన్నారు.ప్రస్తుతం టీడీపీ ప్రభుత్వం మరలా అధికారంలోకి రావడంతో వాటికి పూర్వవైభవం తెచ్చేందుకు అడుగులు వేస్తోందన్నారు. గ్రామాల్లో పశు పోషణ, కోళ్లు,గొర్రెలు, మేకలు పెంపకానికి మెరుగైన వసతి కల్పిస్తూ,పెంపకందార్లను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. 90 శాతం సబ్సిడీతో ప్రభుత్వం అందించే ఈ పథకాన్ని అర్హులైన

ప్రతి ఒక్క పాడి రైతు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పశువుల షెడ్ల నిర్మాణానికి రైతులు సహకరించి తద్వారా పశువుల పెంపకం అభివృద్ధితో దేశాభివృద్ధికి తోడ్పడాలన్నారు. రైతులకు, ఋణాలపై అవగాహన, వాటి లబ్దిపై, వాటిని పొందే విధానంపై బ్యాంకర్స్,అగ్రికల్చర్, ఇతర ప్రభుత్వ అధికారులు కలిసి ప్రతీ నెల ఒక మీటింగ్ ఏర్పాటు చేసి రైతులకు,ముఖ్యంగా పశువుల పెంపకం దారులకు ఋణాలను అందించే బాధ్యత మీ పై ఉందని పశుసంవర్ధక శాఖ అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు ఘంటా మురళి,పశుసంవర్ధక అధికారులు,స్థానిక తెలుగుదేశం,కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

గుంతల రహిత ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వ లక్ష్యం

రూ. 25 కోట్లతో పాలకొల్లు - మార్టేరు రోడ్డు విస్తరణ పనులు ప్రారంభం

విశాలాంధ్ర - పాలకొల్లు: గుంతల రహిత ఆంధ్ర ప్రదేశ్‌గా రహదారులను తీర్చిదిద్ది, ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించడమే ఎన్డీఏ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర జలవనుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. బుధవారం పాలకొల్లు మండలం ఉల్లంపర్రు గ్రామంలో రూ. 25 కోట్లతో జరిగే పాలకొల్లు – మార్టేరు రోడ్డు విస్తరణ మరియు పటిష్టపరచు పనులకు మంత్రి భూమి పూజ చేశారు. కొబ్బరికాయ కొట్టి, ప్రొక్లైన్ ను డ్రైవ్ చేస్తూ లాంఛనంగా రహదారి విస్తరణ పనులను మంత్రి రామానాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి రామానాయుడు మాట్లాడుతూ ఏ ప్రాంతం అయినా వ్యవసాయ, పారిశ్రామిక రంగం, శాంతి భద్రతలతో కల్పించడంతోపాటు, రహదారులు అభివృద్ధి చెందినప్పుడే ప్రాంతాలు, రాష్ట్రాలు అభివృద్ధి చెందుతాయని అన్నారు. చంద్రబాబు నాయుడు హయాంలో ఇంటింటికి, వాడ వాడకు సిమెంటు రోడ్లు వేసి అభివృద్ధి చేశారన్నారు. గ్రామాల నుండి మండలాలకు, జిల్లాలకు అనుసంధానం చేస్తూ

రహదారులను సీఎం చంద్రబాబు నాయుడు ఎంతో అభివృద్ధి చేశారని కొనియాడారు. రాష్ట్రంలో గుంతల రహిత ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా ప్రతి జిల్లాలో పనులు వేగవంతంగా జరుగు తున్నాయని, సంక్రాంతి లోపుగా ప్రమాదం లేని ఆరోగ్యకరమైన రహదారులుగా తీర్చిదిద్దుతామని మంత్రి ప్రకటించారు. ఈ కార్యక్రమంలో మాజీ శాసన మండలి సభ్యులు అంగర రామ్మోహన్, ఆర్ అండ్ బి శాఖ డిఇ బి.వి. రమణ, సహాయ సంచాలకులు డి.యస్.యన్. మూర్తి, టిడిపి సీనియర్ నాయకులు గండేటి వేంకటేశ్వరరావు, ఉన్నమట్ల కబర్ధి, కర్నేన గౌరు నాయుడు, పెనుమత్స రామభద్రరాజు, జక్కంశెట్టి కుమార్, తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి కరాటే పోటీలలో దూబచర్ల క్రీడాకారులకు బంగారు పథకాలు

విశాలాంధ్ర - దేవరపల్లి : జాతీయస్థాయిలో ఉత్తరప్రదేశ్ రాష్ట్రం వారణాసి హిందూ విశ్వ విద్యాలయంలో ఈనెల 22, 23 న జరిగిన 9వ జాతీయ కరాటే పోటీ లలో ఆంధ్రప్రదేశ్ తరపున పాల్గొ న్న దేవరపల్లి దూబచర్ల గ్రామాలకు చెందిన క్రీడాకారులు బంగారు పతకాలు సాధిం చినట్టు కోచ్ జక్కం శెట్టి శ్రీనివాస్ తెలిపారు . పోటీలలో కే భాగ్యశ్రీ, వి హేమ, లోహిత్ చౌదరి, తనూజ, బంగారు పతకాలు సాధించారని, రెండవ స్థానంలో రేష్మ శ్రీ జాఫర్ భాషా ఉన్నా రని తెలిపారు. మొదటి రన్నింగ్ ట్రోఫీ ఆంధ్రప్రదేశ్ క్రీడాకారులు సాధిం చారని తెలిపారు .

క్యాండిల్ యూత్ వాలంటీర్ ఆర్గనైజేషన్ దుప్పట్లు పంపిణీ

విశాలాంధ్ర - జగ్గంపేట : క్రీస్తు పుట్టినరోజును పురస్కరించుకొని జగ్గంపేట పరిసర ప్రాంతాల్లో ఉండే రాజస్థాన్ కార్మికులకు క్యాండిల్ యూత్ వాలంటీర్ ఆర్గనైజేషన్ ఛైర్మన్ జుత్తుక నాగేశ్వరరావు బుధవారం నూతన వస్త్రాలు, దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ క్రిస్మస్ పర్వదినాన్ని పురష్కరించుకుని దాతల సహకారంతో నేడు పేదలకు వస్త్రాలు, దుప్పట్లు అందించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో యూత్ సభ్యులు రాజేష్, కరుణ కుమార్, ప్రసాద్, నూకరాజు, తేజ తదితరులు పాల్గొన్నారు.

కొవ్వూరు మున్సిపాల్టీకి ఉత్తమ అవార్డులు..

విశాలాంధ్ర - కొవ్వూరు : మున్సిపాలిటీ.. ఇదొక స్థానిక సంస్థ అయితే రాష్ట్రంలోని ప్రతి మున్సిపాలిటీలో ఉన్న ప్రజలు పూర్తి సంతృప్తిగా ఉండరు ఎందుకంటే పారిశుద్యం దోమల నివారణ కుక్కల బెడద ఇటువంటి పలు సమస్యలు ఆయా పట్టణాలలో చోటుచేసుకుంటాయి. అయితే కొంతమంది నిబద్ధత కలిగిన కమిషనర్లు కొంతమేర కఠిన నిర్ణయాలు తీసుకుంటూ పాలనను అదుపులోకి తెస్తుంటారు..ఆకోవకే చెందిన మున్సిపాలిటీగా కొవ్వూరు మున్సిపాలిటీ పరిగణించవచ్చు. విజయవాడలో సంభవించిన తుఫాను సమయంలో సీఎం చంద్రబాబు నాయుడు ఇచ్చిన పిలుపుమేరకు రాష్ట్రంలోని ప్రతి మున్సిపాలిటీ నుంచి శానిటరీ కార్మికులు విజయవాడ వెళ్లి వాళ్లకు కేటాయించిన ప్రాంతాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలని సంపూర్ణంగా నిర్వహించి వచ్చారు. దీని ఫలితంగా నిన్న మున్సిపాలిటీలో పారిశుద్ధ్య కార్మికులందరికీ రెండు జతల బట్టలను ఎమ్మెల్యే వెంకటేశ్వరరావు కమి షనర్ నాగేంద్ర కుమార్ అందజేశారు. అంతేకాకుండా రెండు మూడు రోజుల క్రితం స్థానిక ఏబీఎన్ పి ఆర్ ఆర్ డిగ్రీ కళాశాలలో మెగా జాబ్‌మేళా నిర్వహించిన మున్సిపల్ అధికారులు కార్మికులు తమ విధులను సక్రమంగా నిర్వర్తించి ఈ జాబ్ మేళాను విజయవంతం చేశారు. దాదాపు 40 కంపెనీలు 15 వందల ఉద్యోగాల కోసం ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ మేళాలో609 మంది నిరుద్యోగులు ఉద్యోగాలను పొంది నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ నాగేంద్ర కుమార్ ఆధ్వర్యంలో మేనేజర్ సాయిబాబా ఇతర అధికారులు ఈ కార్యక్రమాన్ని దగ్గరుండి పర్యవేక్షించి విజయవంతం చేశారు. అందుకు గాను ఉత్తమ అధికారులుగా గుర్తించి షీల్డులను ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అందజేశారు.

కొవ్వూరు బస్టాండ్ పరిధిలో అక్రమంగా బడ్డీలు పెట్టేందుకు ప్రయత్నం

సహకరిస్తున్న ఆర్టీసీ ఉన్నతాధికారులు

విశాలాంధ్ర - కొవ్వూరు : కొవ్వూరు బస్టాండ్ ఆవరణ ఇప్పటికే పలు వివాదాలకు తావిచ్చింది. ఎందుకంటే బస్టాండ్ పక్కనే మద్యం దుకాణం ఉండడంతో ఇప్పటికే ఆ ప్రాంతంలో ఇబ్బడి ముబ్బడిగా పలుబడ్డీలు తయారయ్యాయి. వీరు మద్యం బాబులకు గ్లాసులు వాటర్ ప్యాకెట్లు కూల్ డ్రింకులు అమ్మడం ద్వారా వ్యాపారం కొనసాగిస్తున్నారు. అయితే ఇక్కడ మరో తీవ్రసమస్య ఏర్పడింది బస్టాండ్‌కి వెళ్లే ప్రజలకు విద్యార్థులకు తీవ్ర సమస్యలను ఎదుర్కొంటున్నారు. ఇదిలా ఉండగా కొవ్వూరు బస్టాండ్ లోపల ఉన్న కిళ్లి బడ్డీని బస్టాండ్ గేటు బయట పెట్టుకోవడానికి ఆర్టీసీ స్థానిక అధికారులు అనుమతి ఇచ్చారన్న ప్రచారం జరుగుతుంది. దీంతో నిర్వాహకులు గేటు బయట ఉన్న డ్రైనేజీ వద్ద కిళ్లి బడ్డిని ఏర్పాటు చేయడానికి ప్రయత్నిస్తూ సిమెంట్ బళ్లను ఏర్పాటు చేశారు. ఈ విషయమై ఆర్టీసీ డిపో మేనేజర్ మూర్తిని విశాలాంధ్ర వివరణ కోరగా నేను ఈరోజు ఉదయమే చూసాను అది కేవలం ఆ ప్రదేశాన్ని శుభ్రం చేయడానికి మాత్రమే అనుమతిచ్చానని పేర్కొన్నారు. కానీ బడ్డీ నిర్వాహకులు పక్కా ప్లాన్ తో అధికారులను మభ్యపెట్టి ముందుకు వెళుతున్నట్లు సమాచారం. ఈ బడ్డీ ఏర్పాటు చేస్తే శాంతి భద్రతలకు విఘాతం కలిగే అవకాశం ఉందని పట్టణ ప్రజలు ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోలీసు అధికారులు ఈ విషయంపై దృష్టిసారించి శాంతి భద్రతలను కాపాడాలని వారు కోరుతున్నారు.

క్రిస్మస్ వేడుకలలో ఎమ్మెల్యే బత్తుల

విశాలాంధ్ర - సీతా నగరం: మండల వ్యా ప్తంగా అన్ని గ్రామాలలో ఘనంగా క్రిస్మస్ వేడు కలు నిర్వహించారు. బుధవారం క్రిస్మస్ సందర్భంగా చర్చుల దగ్గర ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. దీనిలో భాగంగా రాజానగరం నియోజక వర్గ ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ పాల్గొని మాట్లాడుతూ క్రీస్తు చూపిన ప్రేమ మార్గాన్ని ప్రతి ఒక్కరూ అనుసరించాలని అన్నారు. క్రీస్తు మార్గం ప్రపంచ మానవాళికి అనుసరణీయమని అన్నారు. క్రీస్తు దయాగుణం గురించి తెలియజేసేదే క్రిస్మస్ చిహ్నమని అన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

గుడూరు ఇంగ్లీష్ మీడియం కాన్వెంట్‌లో క్రిస్మస్ వేడుకలు

విశాలాంధ్ర - గోపాలపురం : ప్రేమకు ప్రతిరూపముగా ఏసు క్రీస్తు లోక రక్షకుడిగా ఉద్భవించెను అని బాపూజీ ఇంగ్లీష్ మీడియం కాన్వెంట్ కరస్పాండెంట్ గూడూరి వెంకటేశ్వరరావు తెలిపారు. క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని స్థానిక గూడూరు ఇంగ్లీష్ మీడియం కాన్వెంట్ నందు క్రిస్మస్ వేడుకలు స్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ వెంక టేశ్వరరావు మాట్లాడుతూ కులమతాలకతీతంగా తమ పాఠశాల నందు క్రిస్మస్ సంక్రాంతి వేడుకలను ఆయా సాంప్రదాయాలకు అనుకూలంగా గత కొన్నేళ్లుగా నిర్వహిస్తున్నామని ఆయన అన్నారు. అనంతరం క్రిస్మస్ కేక్ ఉపాధ్యాయులు విద్యార్థులచే కోసి స్వీట్స్ పంచుకున్నారు. విద్యార్థినీ విద్యార్థులచే క్రిస్మస్ గీతా లాపనలు, కొరియోగ్రఫీ సాంగ్స్ నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో ప్రిన్సిపాల్ రాగ శ్రీ, ఉపాధ్యాయులు కనకదుర్గ, సునీత, లలిత, చంద్రలేఖ, ఉపాధ్యాయులు ,విద్యార్థులు పాల్గొన్నారు.

జన సైనికులు విలవిల ..

విశాలాంధ్ర - కడియం : ఏ రాజకీయ పార్టీకైనా కార్యకర్తలే మూల స్తంభాలు... అటువంటి కార్యకర్తలను పట్టించుకోకపోతే పార్టీ మనుగడే కష్టమన్న సంగతి అందరికీ తెలిసిందే. గత ఐదు సంవత్సరాల్లో కార్యకర్తలను పట్టించుకోకుండా వలంటీర్లను నమ్ముకున్న "వైసీపీ " భారీ మూల్యమే చెల్లించుకుంది. ప్రస్తుతం రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గంలో జనసేన పార్టీలో ఇదే పరిస్థితి నెలకొంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో జనసేనకు గట్టిపట్టున్న నియోజకవర్గాలలో రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గం ఒకటి. 2019 సార్వత్రిక ఎన్నికల్లో జనసేన తరపున పోటీచేసి ఓడిన కందుల దుర్గేష్ 2024 నాటికి పార్టీని మరింత బలోపేతం చేశారు. వివాదరహితులు, సౌమ్యులు, మంచి వక్త, రాష్ట్ర రాజకీయాల పట్ల పూర్తి అవగాహన కలిగిన ఆయన ప్రతి ఒక్కరిని పేరుపేరునా పలకరిస్తూ కార్యకర్తలకు తలలో నాలుకయ్యారు. వివిధ నాటకీయ పరిణామాల మధ్య దుర్గేష్‌కు నిడదవోలు టిక్కెట్టు దక్కడం, విజయం సాధించి రాష్ట్ర మంత్రివర్గంలో స్థానం పొంది పర్యాటక రంగాన్ని పరుగులు పెట్టించడంతోపాటు నిడదవోలు పైనే దృష్టి సారిస్తున్నారు. మరో ప్రక్క కూటమి అభ్యర్థిగానే విజయం సాధించిన బుచ్చయ్య చౌదరి కొంతమంది మండల స్థాయి జనసేన పార్టీ నాయకులకు ఓ మోస్తరు గౌరవాన్ని ఇస్తూ, మిగతా జనసేన క్యాడర్ ను ఏమాత్రం పట్టించుకోకపోవడంతో జన సైనికులు విలవిలలాడుతున్నారు. ఏ కష్టం వచ్చినా నష్టం వచ్చినా చోటా మోటా నాయకుల ప్రమేయం లేకుండానే దుర్గేష్‌ను కలిసి వచ్చేవారమని ఇప్పుడా పరిస్థితి లేదని వాపోతున్నారు. తమ గోడు వినిపించుకోవడానికి ఒక నాయకుడు కావాలంటున్నారు. మరో ప్రక్క గ్రామస్థాయి, మండల స్థాయి నాయకులుగా గుర్తింపుపొందిన వారు మాత్రం పార్టీ గోల మాకేల బుచ్చయ్య ప్రసన్నం ఉంటే చాలు అంటూ ఆయనతో చెట్టా పట్టాలు వేసుకుని తిరుగుతున్నారు.. ఇసుక, గ్రావెల్ అమ్ముకుంటూ నాలుగు రాళ్ళు వెనకేసుకుంటున్నారు. ఎవరైనా జనసైనికులు ప్రశ్నిస్తే పార్టీ పదవులు పీకేస్తూ జనసేన కు దూరం చేసేస్తున్నారు.. ఇలా పార్టీకి నష్టం తెచ్చే పనుల్లో బిజీ బిజీగా వున్న మండల స్థాయి పార్టీ నాయకుడు స్థానిక ఎంపిపి కార్యాలయం వద్ద ఊడిగం చేస్తున్నట్లు జనసేన శ్రేణులు బహిరంగంగా విమర్శిస్తున్నారు. పిఠాపురం నుండి ఎన్నికై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా వ్యవహరిస్తున్న పవన్ కళ్యాణ్ నియోజకవర్గంలో సైతం తెలుగుదేశం పార్టీ పట్టును కోల్పోకుండా వర్మను ప్రోత్సహిస్తున్నా... పవన్ కళ్యాణ్ వ్యవహార శైలి పట్ల జన సైనికులు ఆందోళన చెందుతున్నారు. ఏ మాత్రం ప్రభావం లేని భారతీయ జనతా పార్టీ, కాంగ్రెస్ పార్టీ రూరల్ లో కోఆర్డినేటర్లు నియమించారని, ఎంతమంది ఉన్నారు కాదు ఎవరున్నారన్నదే ముఖ్యమని "కాటమరాయుడు" సినిమాలో చెప్పినట్లు మా నియోజకవర్గానికి కోఆర్డినేటర్‌ను నియమిస్తే ఆయన వెనుక పయనిస్తామంటున్నారు జన సైనికులు.

ఎన్నికల్లో బూటకపు వాగ్దానం... ఇప్పుడు ప్రజలపై భారం

విశాలాంధ్ర - అనపర్తి : విద్యుత్ ఛార్జీలు పెంచబోమని ఎన్నికల ముందు వాగ్దానం చేసిన ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు అధికారం చేపట్టిన తర్వాత ఏరుదాటక తెప్పతగలేసినట్టు ఇప్పుడు ప్రజలపై సుమారు రూ. 15వేల 486 వేల కోట్ల రూపాయలు భారం మోపారని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి విమర్శించారు. ఈనెల 27వ తేదీన వైఎస్ఆర్‌పి చేపట్టనున్న ధర్నా పోస్టర్ మాజీ ఎమ్మెల్యే సత్తి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 27 వ తేదీ ఉదయం 9 గంటలకు పార్టీ నియోజకవర్గ కార్యాలయం అనపర్తి నుండి ర్యాలీగా బయలుదేరి దుప్పలపూడిలో విద్యుత్ శాఖ అధికారులకు వినతి పత్రం అందించను న్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ సత్తి రామకృష్ణారెడ్డి(రాంబాబు), అన పర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సబ్బెళ్ళ కృష్ణారెడ్డి, రంగంపేట మండల పార్టీ ఇం చార్జ్ నల్లమిల్లి మురళీమోహన్ బాలకృష్ణారెడ్డి(మురళి), సర్పంచ్ వారా కుమారి, ఉప సర్పంచ్ సత్తి సూరారెడి, వైస్ ఎంపీపీ కర్రి దాసు, పలువురు ఎంపీటీసీలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

విశాలాంధ్ర - దేవరపల్లి : మండలంలో బుధవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరి గాయి. ఈ సందర్భంగా చర్చిలలో క్రిస్మస్ కేకులు కట్ చేసి క్రైస్తవులు పరస్పర శుభాకాంక్షలు తెలియజేసుకు న్నారు. మండలంలో గౌరీపట్నం నిర్మలగిరి మేరీ క్షేత్రం లో క్రిస్మస్ వేడుకలు క్షేత్రం డైరెక్టర్ ఫాదర్ జాన్ పీటర్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి ఉదయం హౌస్ వద్ద క్రీస్తు జననానికి చెందిన పశువుల పాక నమూనా క్రిస్మస్ ట్రీ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. నిర్మలగిరి పుణ్యక్షేత్రాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఈ సందర్భంగా క్షేత్రం డైరెక్టర్ ఫాదర్ జాను పీటర్ మాట్లాడుతూ క్రీస్తు ఆరాధనే క్రిస్మస్ అని అన్నారు.

జెఎన్‌టియుకె ప్రాంగణంలో ఐక్యరాజ్యసమితి గుర్తింపు పొందిన

194 దేశాల జాతీయ పతాకాల ఆవిష్కరణ

విశాలాంధ్ర - కాకినాడ : జెఎన్‌టియుకె ప్రాంగణంలో బుధవారం పూర్వ విద్యార్థి సుందర్ అసోసియేట్స్ ఛైర్మన్ డా బాదం సుందరరావు సహకారంతో యూనివర్శిటీ పరిపాలనా భవనం వద్ద భిన్నత్వంలో ఏకత్వం అనే నానుడిని స్ఫూర్తిగా తీసుకుని వాక్ విత్ నేషన్స్ పేరుతో ఏర్పాటు చేసిన ఐక్యరాజ్యసమితి గుర్తింపు పొందిన 194 ప్రపంచ దేశాల జాతీయ పతాకాలను ఇన్‌ఛార్జి ఉపకులపతి ప్రొ కెవిఎస్‌జి మురళీకృష్ణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి ఉపకులపతి ప్రొ కెవిఎస్‌జి మురళీకృష్ణ మాట్లాడుతూ ఐక్యరాజ్యసమితి ప్రధాన కేంద్రమైన స్విట్జర్లాండ్ దేశంలోని జెనీవాలో ఉన్న 194 ప్రపంచ దేశాల జాతీయ పతాకాలను ఆదర్శంగా తీసుకుని మొదటగా జెఎన్‌టియుకె యూనివర్శిటీలో ప్రపంచ దేశాల జాతీయ జెండాలు ఏర్పాటు చేయడం చాలా ఆనందంగా ఉందన్నారు. ప్రపంచంలో మొత్తం ఐదు దేశాలలో జెనీవా, అమెరికాలోని న్యూయార్క్, దక్షిణ కొరియాలోని సియోల్, చైనాలోని షాంఘై, డొమినికన్ రిపబ్లిక్‌లోని శాంటో డొమింగోలో ప్రపంచ దేశాల జాతీయ జెండాలను ఏర్పాటుచేశామని, ఆరోది భారతదేశంలోని జెఎన్‌టియుకెలో ఏర్పాటు చేశామన్నారు. వసుధైక కుటుంబం అనేది దీని ముఖ్య ఉద్దేశ్యమని, అన్ని దేశాల జెండాలు ఒకే చోట ఉండడం ద్వారా కలిగే అనుభూతి చెప్పలేనిదన్నారు. ఐక్యరాజ్య సమితి గుర్తింపు పొందిన 194 దేశాల జాతీయ జెండాలు అక్షర క్రమంలో ఉంటాయని, ప్రతీ జెండా స్తంభానికి క్యూ ఆర్ కోడ్‌తో కూడిన డిస్‌ప్లేను ఉంచామని, దీని ద్వారా ఆ దేశ జనాభా, రాజధాని, కరెన్సీ తదితర వివరాలు తెలుసుకోవచ్చునన్నారు. జెఎన్‌టియుకె అనుబంధ కళాశాలలతో పాటు జిల్లాలోని ప్రతీ స్కూల్, ప్రతీ సంస్థ జెఎన్‌టియుకెను సందర్శించి ఫోటోలు తీసుకోవడన్ని గర్వంగా భావించడంతో పాటు విజ్ఞాన, పర్యాటక ప్రదేశంగా మారబోతుందన్నారు. వాక్ విత్ నేషన్స్ అనేది ప్రపంచ పౌరసత్వం స్ఫూర్తిని ప్రతిబింబించే ప్రాజెక్ట్ అని, ఇది పరస్పర సాంస్కృతిక అవగాహనను ప్రోత్సహిస్తూ వైవిధ్యంగా నిలుస్తుందన్నారు. ఒడిస్సీ ఆఫ్ నేషన్స్ ద్వారా సంస్కృతులు, సాంప్రదాయాల పట్ల ప్రతీ ఒక్కరికి అవగాహనను పెంపొందిస్తాయన్నారు. ఈ ప్రాజెక్ట్ పూర్తయ్యేందుకు సహకరించిన యూనివర్శిటీ అధికారులకు, సుందర్ అసోసియేట్స్ ఛైర్మన్ డా బాదం సుందర రావు, సుధారాణి దంపతులకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. సుందర్ అసోసియేట్స్ ఛైర్మన్ బాదం సుందరరావు మాట్లాడుతూ ఇన్‌ఛార్జి ఉపకులపతి ప్రొ కెవిఎస్‌జి. మురళీకృష్ణ వాక్ విత్ నేషన్స్ అనే కాన్సెప్ట్‌తో భారతదేశంలోఈ జెండాలను ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనను తీసుకువచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ ప్రొ కెవి రమణ, ఓఎస్‌డి ప్రొ డి కోటేశ్వరరావు, ఛీఫ్ ఇంజనీర్ ప్రొ వి శ్రీనివాసులు, మాజీ ఉపకులపతులు ప్రొ ఎస్ శ్రీనివాసకుమార్, ప్రొ జివిఆర్ ప్రసాదరాజు, ప్రొ కె పద్మరాజు, డైరెక్టర్లు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రేపు వైసీపీ పోరుబాట

విశాలాంధ్ర - జగ్గంపేట : ప్రజల పక్షాన పోరాడేందుకు ఈనెల 27న వైసీపీ పోరుబాట కార్యక్రమం నిర్వహించనున్నట్లు పార్టీ మండల అధ్యక్షులు రావుల గణేష్ రాజా తెలిపారు. స్థానిక వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన పార్టీ నాయకులతో కలిసి వైఎస్ఆర్సిపి పోరుబాట కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గణేష్ రాజా మాట్లాడుతూ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి పిలుపుమేరకు పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త తోట నరసింహం ఆధ్వర్యంలో పెంచిన విద్యుత్ ఛార్జీలపై నిరసన చేపట్టి 27వ తేదీన జగ్గంపేట పట్టణంలోని కోనేటి వీధి నుండి ఎలక్ట్రికల్ డిఇ ఆఫీస్ వరకు ర్యాలీ నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు కాపవరపు ప్రసాద్, వరుపుల సూరిబాబు, గుర్రం మహాలక్ష్మి, భూమాద గణపతి, కాపవరపు వెంకటరమణ, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆముడా ఛైర్మన్ అల్లాడి సోంబాబుకి సన్మానం

విశాలాంధ్ర - అమలాపురం : అమలాపురం అర్బన్ డెవలప్మెంట్ అథా రిటీ ఛైర్మన్ అల్లాడస్వామినాయుడు (సోంబాబు)ని బుధవారం అభినందించారు. అభినందించిన వారిలో సోమిశెట్టి ల్యాండ్ మార్క్ అధినేత, రాజోలు తాలూకా తెలగా అభ్యుదయ సంఘం ఉపాధ్యక్షులు సోమిశెట్టి ఆంజ నేయులు, అమలాపురం తెలగా అభ్యుదయ సంఘం ఉపాధ్యక్షులు, జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి నల్లా స్వామి, ఎల్జీ ఎలక్ట్రానిక్స్ కోనసీమ డిస్ట్రిబ్యూటర్ సూర్యనారాయణమూర్తి, సంపూర్ణ ఫర్నిచర్ సుబ్బారావు ఉన్నారు.

అయోడిన్ లోపం పై అవగాహన

విశాలాంధ్ర - కపిలేశ్వరపురం : మండలంలోని కపిలేశ్వరపురం, అంగర, టేకి, గ్రామాలలో ఇన్స్టిట్యూట్ ఆఫ్ గ్లోబల్ డెవల ప్మెంట్ ఐటిసి ఆధ్వర్యంలో అయోడిన్ లోపంపై అవగాహన కల్పిస్తూ బుర్రకథల రూపంలో అయోడిన్ లోపం వల్ల కలిగే రుగ్మతలను వివరించారు. ఆహారంలో అయోడిన్ సరైన మోతాదులో లేకపోవడం వల్ల అయోడిన్ లోపం ఏర్పడుతుందని ఈ లోపం వల్ల గాయిటర, మానసిక ,శారీరక అభివృద్ధిలో వెనక పడడం వంటి సమస్యలు వస్తాయన్నారు. అయోడిన్ ,ఇనుము అధికంగా ఉండే సముద్రపు ఆహారాలతో, మాంసకృతులు ఉండే ఆహారాన్ని సేకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఓఆర్డబ్ల్యూ కే కళ్యాణి, ఏఎన్ఎం, ఆశ వర్కర్లు, ఎంఎల్‌హెచ్ పి స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

సొంత వైద్యం మంచిది కాదు : డాక్టర్ చప్పిడి

విశాలాంధ్ర - కాకినాడ : సొంత వైద్యము మంచిది కాదని డాక్టర్ల సూచన మేరకే మందులు వాడాలని ఏ డాక్టర్ దగ్గరికి వెళ్లిన ముందు ఉన్న మందులు రిపోర్ట్స్ మొత్తం అన్ని కూడా డాక్టర్ దగ్గరికి తీసుకెళ్లి చూపించాలని మధుమేహ వ్యాధిగ్రస్తులు నడక తప్పనిసరిగా అలవాటు చేసుకోవాలని అలయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ కమిటీ చైర్మన్ హెల్త్ అవేర్ సంస్థ అధ్యక్షులు రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. రామచంద్రపురం పాత బస్టాండ్ వద్ద సుభిభవ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు నాగిరెడ్డి వెంకన్న, హెల్త్ అవేర్ సంస్థ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ చప్పిడి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యాయామం తప్పనిసరని, మందులు క్రమ పద్ధతిలో వాడాలని చెప్పారు. వెనుకబడిన తరగతుల వారికి నామినేటెడ్ పదవుల్లో రిజర్వేషన్ కల్పి స్తామన్న చంద్రబాబు నాయుడుకి కృతజ్ఞతలు తెలిపారు. కంటి వైద్య నిపుణులు డాక్టర్ ఉన్న గిరి అనుపమ ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ ఈశా దీపిక వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో కార్యదర్శి ఈత ప్రసాద్, కోశాధికారి శేషగిరి కృష్ణ, కొయ్య బంగారు బాబు, రాంబాబు, దూలి పూడి ప్రభాకర్, చంద్రరావు, శ్రీనివాసరావు, నాగమణి, శ్రావణి, లక్ష్మి పాల్గొన్నారు.

పొరుగు వారితోప్రేమ, దయ,కలిగి ఉండాలి

క్రైస్తవ సంఘాలకు ఎమ్మెల్యే నానాజీ బహుమతులు పంపిణీ

విశాలాంధ్ర - కాకినాడ : క్రిస్మస్ పర్వదినం సందర్భంగా కాకినాడ రూరల్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే పంతం నానాజీ ఆధ్వర్యంలో కాకినాడ రూరల్, కరప మండలా లలో ఉన్న అన్ని క్రైస్తవ సంఘాలకు క్రిస్మస్ కేకులు, బహుమతులు పంపిణీ చేసి క్రైస్తవులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నానాజీ మాట్లాడుతూ జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ క్రైస్తవ మత బోధనలకు ఎంతో ఆశక్తులై ఆచరణలో తను పొందిన అనుభూతులను ఈ సందర్భంగా గుర్తు చేశారు. పొరుగు వారిపట్ల ప్రేమ, దయ, కృప కలిగి ఉండాలన్నారు. ఈ సందర్భంగా తెలియజేశారు. ప్రతి ఒక్కరూ క్రైస్తవ బోధ నలు ఆచరించి ఇతరుల పట్ల ప్రేమ, కరుణ, ఆదరణ కలిగి పొరుగువారి పట్ల స్నేహభావంతో కలిగి ఉండాలని సూచించారు. సీఎం చంద్రబాబు, ఉపముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్, కూటమి నాయకులు ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు.

విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసేందుకే విద్యా, వైజ్ఞానిక ప్రదర్శన

విశాలాంధ్ర - అమలాపురం : విద్యార్థుల్లో దాగి ఉన్న సృజ నాత్మకతను, పరిశోధనాసక్తిని వెలికి తీస్తూ ప్రోత్సహించే లక్ష్యంతో విద్య, వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి షేక్ సలీం బాషా బుధవారం ప్రకటనలో పేర్కొన్నారు. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులను భావి శాస్త్ర వేత్తలుగా తీర్చి దిద్దేందుకు ప్రభుత్వం విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనలు ఏర్పాటు చేసిందన్నారు. సమాజంలో వచ్చే మార్పులకు అనుగుణంగా విద్యార్థులు తమ ఆలోచనలకు పదును పెట్టి ఆవిష్కరణలు చేసేలా పాఠశాల స్థాయి నుంచే ప్రోత్సహించాలని లక్ష్యంగా నిర్దేశించారన్నారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో 6 నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థుల నుంచి వచ్చిన ఉత్తమ ఆలోచనలను పరిగణనలోనికి తీసుకొని విద్యార్థులు ప్రాజెక్టులను తయారు చేయాలన్నారు. ప్రతి పాఠశాల నుంచి వీటిలో ఏదో ఒక ప్రాజెక్టును తయారు చేసి జిల్లా స్థాయి ప్రదర్శనలో ప్రదర్శించాలన్నారు. కోనసీమ జిల్లా విద్యా శాఖ ఆధ్వర్యంలో మండల స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనను విజయవంతంగా నిర్వహించేందుకు తగిన మార్గదర్శకాలను విడుదల చేశారు. మండల స్థాయి ప్రదర్శనకు సంబంధించి తేదీ సమయాలను 29వ తేదీకి ముందు తెలియజేయాలన్నారు. మండలంలోని అన్ని యాజ మాన్య పాఠశాలలు తప్పనిసరిగా పాల్గొనాల న్నారు. పాల్గొనలేని పాఠశాలల వివరాలను జిల్లా సైన్స్ అధికారికి అందజేయాలన్నారు. ప్రతి మండ లానికి ఒక నోడల్ హెచ్ఎంను ఎంపిక చేసి, వివరాలను జిల్లా విద్యాశాఖ అధికారికి అందజే యాలన్నారు. ప్రదర్శన నిర్వ హణకు తగిన వేదిక లను ఎంపిక చేసి, ఈ వివ రాలను 26వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు జిల్లా సైన్స్ అధి కారికి సమర్పించాలని, ప్రదర్శన లో ప్రదర్శిత మయ్యే ప్రాజెక్టులు శాస్త్రీయతను ప్రతి బింబించా లన్నారు. జిల్లా సైన్స్ అధికారి మండల విద్యాశాఖ అధికారులతో సమన్వయం చేస్తూ అన్ని ఏర్పాట్లను పర్యవేక్షించా లన్నారు. మండల స్థాయి ప్రదర్శన వివరాలపై పూర్తి నివేదికను 26వ తేదీ సాయంత్రం 5గంటల లోపు అందజేయాల న్నారు. ఎటువంటి సందే హాలు ఉన్న జీవీఎస్ సుబ్రహ్మణ్యం జిల్లా సైన్స్ అధికారిని సెల్ నెంబర్ 96401 88525 లో సంప్రదించి నివృత్తి చేసుకోవచ్చన్నారు. జిల్లా స్థాయి విద్యా, వైజ్ఞానిక ప్రదర్శన తేదీ త్వరలో ప్రకటించబడుతుందన్నారు.

దేవి ఎంబ్రాయిడరీ టైలరింగ్ షాపును ప్రారంభించిన ముదునూరి

విశాలాంధ్ర - ప్రత్తిపాడు : మండలంలోని ధర్మవరం గ్రామం నంది సెంటర్లో దేవి ఎంబ్రాయిడరీ టైలరింగ్ నూతన షాపును ప్రత్తిపాడు నియోజక వర్గం వైసీపీనేత ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ముదునూరి మురళీ రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారి నూతన వ్యాపారం అభివృద్ధి చెందాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బెందుకుర్తి అబ్బాయి, బొల్లు చిట్టిబాబు, జువ్వల బాబులు, నానిపల్లి చంటి, తాతబాబు, బొల్లు నాగేశ్వ ర రావు, దొరబాబు, వెంకటేశ్వరరావు, శివ, గోనగాని గోపి, యాళ్ల యేసు, గోనగాని రామకృష్ణ, తుపాటి బాబ్జి, బొల్లు సత్తులు, బాబ్జి, సిద్ద బాబ్జి పాల్గొన్నారు.

కొమరగిరిపట్నంలో మెట్ల వర్ధంతి

విశాలాంధ్ర - అల్లవరం : కొమరగిరిపట్నం మెట్ల రామ్మూర్తి సహకార సంఘం వద్ద మాజీ మంత్రి మెట్ల సత్యనారాయణరావు 9వ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. సహకార సంఘం సీఈవో సత్తిబాబు ఆధ్వర్యంలో పలువురు నాయకులు మెట్ల విగ్రహానికి పూలమా లలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ సొసైటీ అధ్యక్షులు రోహిణి కుమార్, గుర్రం బాబులు, కొమరగిరి పట్నం ఉప సర్పంచ్ శ్రీను ఎన్డీపీ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా కారెం శివాజీ పుట్టినరోజు వేడుకలు

విశాలాంధ్ర - పిఠా పురం : మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు, మాజీ ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ కారెం శివాజీ జన్మదిన వేడుకలను ఆయన అభి మానులు ఘనంగా నిర్వ హించారు. ఈ కార్యక్రమానికి బహుజన సమాజ్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి, పిఠాపురం నియోజకవర్గం ఇన్చార్జి ఖండవిల్లి లోవరాజు, మాల మహానాడు జాతీయ ప్రధాన కార్యదర్శి లింగం శివప్రసాద్ హాజరై ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసి, శాలువ కప్పి, పూలమాలలు వేసి, కేకును తినిపించారు. క్రిస్మస్ సందర్భంగా క్రిస్మస్ శుభాకంక్షలు కూడా తెలిపారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు తీరగటి శివ, మాల మహా నాడు రాష్ట్ర యువజన అధ్యక్షుడు నీలం నాగేంద్రప్రసాద్, పురుషోత్తం శ్రీకాంత్, వీరు, బీసీ నాయకులు అందే వీర బాబు, యాండ్ర ఆనంద్ విష్ణుకు మార్, అంబేద్కర్ యూత్ సభ్యులు బల్లా నవీన్, పవన్, నవజీవన్ ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

వాజ్ పెయి జయంతి వేడుకలు

విశాలాంధ్ర - ఏలేశ్వరం : మండలంలోని యర్రవరం గ్రామంలో మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్ పేయి 100వ జయంతి వేడుకలు ఏలేశ్వరం మం డలం బిజెపి అధ్యక్షుడు కూరాకుల రాజా ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కాకినాడ జిల్లా బిజెపి ఉపాధ్యక్షుడు ఉమ్మిడి వెంకట్రావు హాజరయ్యారు. ముందుగా వాజ్ పయి చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం ఉమ్మిడి వెంకట్రావు మాట్లాడుతూ మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్పేయి అపర రాజకీయ చాణుక్యుడని, సుపరిపాలన దక్షుడని, భారతరత్న బిరుదు బలహీన వర్గాల ఆశాజ్యోతి అని ఆయన కొనియాడారు. అంతేకాకుండా నేషనల్ హైవే విస్తరణ అనేక రాష్ట్రాల్లో అనేక నెంబర్లతో నేషనల్ హైవే విస్తీర్ణ చేయడం ఆయ నకే సాధ్యమైందని వెంకట్రావు అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రత్తిపాడు మం డల ఉపాధ్యక్షుడు ఊటా వీరబాబు, పతివాడ వెంకటేశ్వరరావు, తోట వీర మహేశ్వరరావు, రాఘవరావు, గొడుగు నల్లబ్బాయి, దొడ్డిపట్ల సుబ్బరాజు, దొంతంశెట్టి చంద్రశేఖర్, శ్రీనివాస్, గోపి సాంబశివరావు పాల్గొన్నారు.

వరి రైతుల ఆందోళన

విశాలాంధ్ర-కూచిపూడి: గత మూడు నాలుగు రోజులుగా కురుస్తున్న 15 మిల్లీ మీట ర్లకుపైగా కురిసినవర్షపు జల్లులకు కోత కోసి పనలపై ఉన్న రైతుల పరిస్థితి ఆందోళనగా మారింది. బుధవారం కూడా ఉదయం నుంచి జల్లులు పడుతుండడంతో కోత కోసే సమయానికి గింజ రాలిపోయే స్థితికి చేరుకున్న పైరు ఇటీవల సంభవించిన వాతావరణంలో మార్పులతో పాటు కురుస్తున్నజల్లులకు కంకులుపై ఉన్న ధాన్యం మరింత రాలి పోతుందేమోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ జల్లులు మినుము పైరకు ఎంతో లాభదాయకమని వ్యవసాయ అధికారులు స్పష్టం చేశారు.

పసూన రామన్‌కు సత్కారం

విశాలాంధ్ర-విజయవాడ కల్చరల్ : ప్రణవి మ్యూజికల్ అకాడమీ 6వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న చిత్ర గీతాల వారో త్సవంలో 4వ రోజు బుధవారం సాయంత్రం కొత్తా పూర్ణానందం కళావేదికపై జ్యోతిష్య రత్న ప్రసూన రామన్‌కు ఘన సత్కారం జరిగింది. అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షుడు కారుమంచి రాజు నేతృత్వంలో మేకప్ రాజు పర్యవేక్షించారు. మాజీ ప్రధాని, భారతరత్న అటల్ బిహారి వాజ్‌పేయి చిత్రపటానికి పూలదండలు వేసి అంజలి ఘటించారు. అతిథులుగా విచ్చేసిన రాష్ట్ర బిజెపి నాయకులు కిలారు దిలీప్, అడ్డూరి శ్రీరామ్ లు, దేవిడ్ రాజు, బివి వీరభద్రరావు, పరుచూరి విజయలక్ష్మి, మాట్లాడుతూ భారత రాజకీయాలలో అపర భీష్ముడు, సంకీర్ణ రాజకీయాలకు ఆది గురువు, విలువైన రాజకీయాలకు దర్పణంగా నిలిచిన వాజ్ పేయి జయంతి రోజున రామన్‌ను సత్కరించుకోవటం గొప్ప విషయమన్నారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

విశాలాంధ్ర - గండేపల్లి : గండేపల్లి గ్రామం లోని శ్రీ గీతం ఇంగ్లీష్ మీడియం స్కూల్లో క్రిస్మస్ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ చంద్ర, పాస్టర్ రవి విచ్చేశారు. సందర్భంగా గీతం కరస్పాండెంట్ వివిఎస్‌వి చౌదరి మాట్లాడుతూ క్రీస్తు పుట్టిన రోజున ప్రపంచమంతా క్రిస్మస్ వేడుకలు జరుపుకోంటాయని తెలిపారు. తమ పాఠశాలలో కుల మతాలకతీతంగా అన్ని పండగలు నిర్వహిస్తామనిఅన్నారు. చిన్నారులు శాంతా క్లాస్ వేషధారణ ధరించి తోటి విద్యార్థులకు చాక్లెట్లు అందించారు. క్రీస్తు పుట్టినరోజు కేకును కట్ చేసి విద్యార్థులకు పంపిణీ చేయడం జరిగింది. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

గొల్లప్రోలు : గొల్లప్రోలు పట్టణ మండల వ్యాప్తంగా బుధవారం క్రిస్మస్ అంగరంగ వైభవంగా నిర్వహించారు. చర్చిలన్నీ విద్యుత్ దీపాల కాంతులతో దగదగా మెరిసాయి. పలు చర్చిలలో ఏసుక్రీస్తు జనన విధానాన్ని తెలియజేసేం దుకు బాల యేసు రూపాన్ని పశువుల పాక లో రూపొందించి ప్రదర్శించారు. గొల్ల ప్రోలు పట్టణంలోని స్థానిక బస్టాండ్ వద్ద గల బేతేలు ఆరాధన మందిరంలో పాస్టర్ జాషువా క్రిస్మస్ సందేశాన్ని అందించారు. చిన్నారులు మారుమనస్సు అనే నాటిక ప్రదర్శించి, అభినయ గీతాలు ఆలపించారు.

అల్లవరం : అల్లవరం మండలంలో ప్రతి గ్రామంలో ఘనంగా క్రిస్మస్ వేడుకలు జరుపుకు న్నారు. పలు గ్రామాల్లో చర్చిలకు విద్యుత్ దీపాలు అలంకరించి భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు చేసుకున్నారు.క్రీస్తు సందేశాన్ని ఆలపిస్తు భక్తిగీతాలతో జరుపుకున్నారు.

యానాం : యానాం ఫెర్రీ రోడ్‌లో జీసస్ ప్రేయర్ టవర్ వారి క్రిస్మస్ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు. ఈ సందర్భంగా మల్లాడి కృష్ణారావుని సంఘ సభ్యులు ఘనంగా స్వాగతం పలుకుతూ దుస్సాలువలతో పుష్ప గుచ్చాలతో సత్కరించారు. ఈ సందర్భంగా మల్లాడి కృష్ణారావు ప్రసంగిస్తూ సంఘ సభ్యులందరికీ క్రిస్మస్ మరియు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసి క్రిస్మస్ సందర్భంగా ఏర్పాటు చేసిన కేకును కట్ చేసి సంఘ సభ్యులకు నూతన వస్త్రాలను అందించారు.

పేదలకు నష్టపరహం ఇచ్చేలా చమురు సంస్థలకు విజ్ఞప్తి చేస్తా

ఎంపీ వైద్య లింగం

విశాలాంధ్ర - యానాం : పేదలకు సేవ చేయాలనే భావన యానాం ఎమ్మెల్యేకు, మాజీమంత్రికి లేదు. అన్ని వర్గాల పేదలకు నష్టపరహం ఇచ్చేలా చమురు సంస్థలకు విజ్ఞప్తి చేస్తా అని పుదుచ్చేరి ఎంపీ వైద్య లింగం అన్నారు. కేంద్రపాలిత ప్రాంతమైన అసెంబ్లీ నియోజవర్గంలో నివశిస్తున్న అన్ని వర్గాల పేదలకు చమురు సంస్థలు నష్టపరిహారం విడుదల చేయాలని పార్లమెంట్లో ప్రస్తావిస్తానని పుదుచ్చేరి ఎంపీ వి వైద్య లింగం అన్నారు. పుదుచ్చేరిలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. యానాం అసెంబ్లీ నియోజకవర్గంలో చమురు సంస్థల కార్యకలాపాల వలన ఒకే వర్గానికి నష్టపరిహారం ఇస్తున్నదని, అదే మాదిరిగా అన్ని వర్గాల్లో ఉన్న పేదలకు నష్టపరిహారం ఇవ్వాలని దీనిపై ఉద్యమం చేపడతామన్నారు. చమురు సంస్థల కార్యకలాపాల వలన ప్రమాదాలు సంభవిస్తే ఎవరు బాధ్యత వహిస్తారని ఆయన ప్రశ్నించారు. పేదలకు నష్ట పరిహారం ఇప్పించేలా ఎమ్మెల్యే గొల్లపల్లి మాజీ మంత్రి మల్లాడిలు డిమాండ్ చేయవలసి ఉన్నప్పటికీ వాటిపై ప్రస్తావించారన్నారు. ఒకరికి పేకాట క్లబ్‌తో మరొకరు బార్ అండ్ రెస్టారెంట్లు వ్యాపారంతో పని చేసుకుంటూరన్నారు. పేదలకు సేవ భావంతో పనిచేసే ఉద్దేశం వారికి కనిపించడం లేదన్నారు. పేదల పక్షాన కాంగ్రెస్ పార్టీ ముందుండి పోరాటం చేస్తుందని ఫిబ్రవరి మొదటి వారంలో దీనిపై యానాంలో ఉద్యమం చేపడతామని అన్నారు. ప్రజలందరూ ఈ ఉద్యమానికి మద్దతు పలికి నష్టపరిహారం సాధించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ములగపాటి ప్రసాద్ రాజు, చీకట్ల రామకృష్ణ, దున్నా చక్రవర్తి, కే హరి సత్యనారాయణ, పి సుబ్బరాజు, వినోద్, ఓలేటి శ్రీను, వెంకటేష్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

వీరుళ్లమ్మ ఆలయానికి రూ.లక్ష విరాళం

విశాలాంధ్ర - అనపర్తి, పెదపూడి : ఎంతో ప్రఖ్యాత గాంచిన అనపర్తి గ్రామదేవత శ్రీ వీరుళ్ళమ్మ జాతర, తీర్థ మహోత్సవం పురస్కరించుకుని రిటైర్డ్ ఇంజనీర్ తమలంపూడి రామారెడ్డి లచ్చమ్మ దంపతులు రూ.లక్ష విరాళం అందజేశారు. బుధ వారం స్థానిక వీరుళ్ళమ్మ తల్లి ఆలయ ఆవరణలో ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షులు సత్తి వెంకట రామారెడ్డి కి రామా రెడ్డి దంపతులు విరాళం అందజేశారు. ఈ కార్యక్రమంలో చింతా భగవాన్ రెడ్డి, తమలంపూడి రామారెడ్డి, సుబ్బారెడ్డి, కర్రి వెంకటరెడ్డి, ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

కంబాల శ్రీనివాసరావుకు అభినందనలు

విశాలాంధ్ర - ప్రత్తి పాడు : విశ్వహిందూ పరి రక్షణ రామ సేన అధ్యక్షులు కంబాల శ్రీనివాసరావు బీజేపీలోకి చేరుతున్న సంద ర్భంగా ప్రత్తిపాడు మం డల బిజెపి ఉపాధ్యక్షుడు ఊట వీరబాబు అభినందనలు తెలిపారు. బుధవారం గోకవరంలో నిర్వహించిన భారీ బహిరంగ సభకు ప్రత్తి పాడు మండలం ధర్మవరం నుండి ఆ పార్టీ నాయకులు కార్యకర్తలు తరలివెళ్లారు. సభకు విచ్చే సిన బిజెపి రాష్ట్ర అధ్యక్షు రాలు దగ్గు బాటి పురందేశ్వరి, జాతీయ నాయకులు సోము వీర్రాజు, విశాఖ పట్నం ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు తదితరులను పూట వీరబాబు కలసి మండలంలో నెలకొన్న పలు సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమానికి ముందు ధర్మవరం గ్రామంలో మాజీ ప్రధాని అటల్ బిహారి వాజ్‌పేయి శత జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.

దస్తావేజులు పోయినవి

అంబేద్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం మండలం టేకి గ్రామం **అన్నందేవర వీరరాఘవ, W/o. (లేటు) త్రిమూర్తులు** జిరాక్స్ నిమిత్తం అంగర నుంచి టేకి వస్తుండగా మార్గమధ్యంలో ఇంటి దస్తావేజులు పడిపోయినాయి దొరికిన వారు ఈ నెంబర్‌కి **6302106071, 9951716628** ఫోన్ చేయగలరు.

మహారాజశ్రీ 1వ అదనపు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు,రాజమహేంద్రవరం

IA.No.93/2023 in O.S.No.106/2022

Between:

Pasupuleti Subba Rao **...Petitioner / Plaintiff**

And

Vanga Raja Shekar S/o.V.V. Tirunath, aged 40 years, D.No:23-11-6/1, Flat NO:301, K.R. Classic Apartments, Sri ram nagar, Rajamahendravaram

... Respondent | Deffendant

పై నంబరు పిటీషన్‌లో రెస్పాండెంటు/ డిఫెండెంటు అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమన్లు /నోటీసులు పంపినా మీరు వాటిని తీసుకోకుండ ఉద్దేశ్యపూ ర్వకంగా త్రిప్పి వేయుచున్నారు. కావున ది. 06-01-2025 సంగరం తేదీ ఉదయం 10.30 నిగలకు మీరు స్వయంగా గాని లేదా ప్లీడరు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి సదరు పై పిటీషన్‌లో మీ ఆక్షేపణలను తెలుపుకొనవలెను. లేని యెడల సదరు పిటీషన్ మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వు ప్రకారం)

N.V.విశ్వనాథం
అడ్వకేట్,కాకినాడ

P.సత్యరమేష్,
K.వెంకటలక్ష్మి,

రాజమండ్రి అడ్వకేట్స్,రాజమండ్రి

ప్రభుత్వ కార్యక్రమాలు ఒక్కొక్కటిగా చేపడతాం

విశాలాంధ్ర - నిడదవోలు : నిడదవోలు నియోజకవర్గ ప్రజలకు, మీడియా సోదరులకు రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ క్రిస్మస్, ఆంగ్ల నూతన సంవత్సరం, సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. కూటమి ప్రభుత్వ హయాంలో ప్రజలందరికీ శుభాలు కలగాలని, ఆనందకరమైన జీవితం రావాలని మంత్రి దుర్గేష్ ఆకాంక్షించారు. ప్రభుత్వం పరంగా చేయాల్సిన కార్యక్రమాలు ఒక్కొక్కటిగా చేపడతామని హామీ ఇచ్చారు. రాబోయే రోజుల్లో ప్రజలు సౌకర్యవంతమైన జీవితం గడిపేలా కృషి చేస్తామని తెలిపారు. ప్రజల గొంతుక వినిపిస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాకు మంత్రి దుర్గేష్ ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.

వాజ్‌పెయి జయంతి వేడుకలో మంత్రి :

రాజకీయం, సాహిత్యం సమపాళ్లల్లో నడిపించిన నాయకులు భారత మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్ పేయి అని మంత్రి దుర్గేష్ వెల్లడించారు. భారత మాజీ ప్రధాని, రాజ నీతిజ్ఞుడు వాజ్ పేయి శతజయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి మంత్రి కందుల దుర్గేష్ పూలమాలవేసి ఘన నివాళి అర్పించారు. అనం తరం చర్ల సుశీల వృదాధ్రమంలోని వృద్ధులకు పేదలకు దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న ఒకానొక సమయంలో నాడు ప్రతిపక్షంలో ఉన్న అటల్ బిహారీ వాజ్ పేయ్ ని అంతర్జా తీయంగా జరుగుతున్న ఒక కార్యక్రమానికి అప్పటి ప్రధాన మంత్రి పండిట్ జవహర్ లాల్ నెహ్రూ భారత ప్రభుత్వం తరపున ప్రతినిధిగా పంపించా రని గుర్తు చేశారు. గొప్ప వ్యక్తిత్వం గల, విలువలు గల నాయకుడికి దక్కిన గౌరవం అది అని మంత్రి ఉదహరించారు. అదేవిధంగా అటల్ బిహారీ వాజ్ పేయ్ ప్రధానమంత్రిగా ఉన్న సమయంలో అన్ని మతాలను సమానంగా చూసేవారని, శాంతియుత

- మీడియా మిత్రులకు శుభాకాంక్షలు తెలిపిన మంత్రి దుర్గేష్

సమాజం ఉండాలని కోరుకున్నారని మంత్రి వివరించారు. నేషనల్ హైవేలు, నాలుగు లైన్లు, ఆరు లైన్ల రహదారులు, ఆర్ఓబీలకు ఆద్యుడు వాజ్‌పేయ్ అని మంత్రి దుర్గేష్ తెలిపారు. రాజకీయాల్లో ఉన్న వారికి మార్గదర్శిగా అటల్ బిహారీ వాజ్ పేయ్ నిలుస్తారని మంత్రి అన్నారు. వాజ్ పేయ్ విధానాల్లో ముందుకు వెళ్తే సమ సమాజ స్థాపన జరుగుతుందన్నారు.. తనలాంటి ఎందరికో వాజ్ పేయ్ స్ఫూర్తి ప్రధాత అని మంత్రి వెల్లడించారు.. అన్ని వర్గాలు ఉన్నత స్థానంలోకి చేరాలని మంత్రి అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అటల్ బీహారీ వాజ్ పేయ్ శత జయంతి వేళ ఆయన ఆశయాలను, ఆకాంక్షలను నెరవేర్చేందుకు పునరాంకితం కావాలని పిలుపునిచ్చారు.

జగ్గంపేట పంచాయతీ కార్యదర్శి ఎవరో...?

- 15 ఏళ్లుగా చక్రం తిప్పుతున్న పార్ట్ టైం ఉద్యోగి
- గ్రామస్తులకు ఏ పని కావాల్సినా ఆ ఉద్యోగిని కలవాల్సిందే

విశాలాంధ్ర - జగ్గంపేట : కాకినాడ జిల్లా నియోజకవర్గ కేంద్రమైన జగ్గంపేట గ్రామ పంచాయతీలో పార్ట్ టైం ఉద్యోగిగా పనిచేస్తున్న ఒక వ్యక్తి ఇక్కడ ఆయనే సెక్రటరీ అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. ఆయన గత 20 ఏళ్ళ క్రితం ఒక టీడీపి నేత టైల్స్ ఫ్యాక్టరీలో పనిచేసేవాడు. ఐతే ఆ టీడీపి నేత సర్పంచ్ కావడం అదే సమయంలో ఫ్యాక్టరీ మూసివేయడం జరిగాయి. దీంతో ఆ టీడీపినేత అతన్ని పంచాయతీ పను లకు వినియోగించుకుని దాని నుండే జీతం చెల్లించడం ప్రారంభించారు. ఇక ఇక్కడే మొదలైంది అతని ప్రస్థానం. అప్పటి నుండి ఎంతమంది సర్పంచ్లు వచ్చినా, ఎంతమంది కార్య దర్శులు మారినా అతని స్థానం మాత్రం చెక్కు చెదరకుండా మరింత బలపడింది. దీంతో ఆ గ్రామపంచా యతీకి అతనే కార్యదర్శి అన్నట్లుగా మారాడు. ప్రజలకు ఏ పని కావాల్సిన సదరు ఆ పార్ట్ టైమ్ ఉద్యోగిని కలవాల్సిందే. ఆయనే అపనికి తగ్గ ట్టుగా నిబంధనలు పెడతారు. ప్రజలకు పంచాయతీ నుంచి సేవలు అందాలంటే అతని చేయి తడపనిదే ప్రజలకు సేవలందే విషయంలో అడ్డంకులు సృష్టిస్తాడు. అధికారంలో ఏ పార్టీ ఉన్న గ్రామ పంచాయతీకి కొత్తగా ఏ సెక్రటరీ వచ్చినా ఆ ప్రైవేట్ ఉద్యోగి మాట వినేలా చేసుకోవడం అతనికి వెన్నతో పెట్టిన విద్య. 2019 జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామ సచివాలయాల్లో, పంచాయతీ కార్యాలయంలో సరిపడా సిబ్బంది వచ్చినా ఆవ్యక్తి స్థానం మాత్రం కదలకుండా చేసుకున్నాడు. అతను ప్రస్తు తం ఆ పంచాయతీలో కంప్యూటర్ ఆపరేటర్ ఉద్యోగం విధులు నిర్వహిస్తున్నాడు. పంచాయితీ సేవలు కోసం వచ్చే ప్రజలకు సెక్రటరీకి మధ్య వారధిగా ఉంటూ మామూళ్లు అందుకోవడంలో ఇతను సిద్ధహస్తుడు. అలానే ప్రస్తుతం ఉన్న పంచా యతీ కార్యదర్శిని ఏ వివరాలు అడిగినా ఆ పార్ట్ టైం ఉద్యోగినే అడగాలి అంటున్నారు. దీంతో పం చాయతీ కార్యదర్శి ఈయన, పార్ట్ టైం ఉద్యోగా? అనే అనుమానం ప్రజలకు కలుగు తుంది. ఇప్ప టికైనా ఉన్నతాధికారులు స్పందించి జగ్గంపేట గ్రామ పంచాయతీని అధీనంలోకి తీసుకున్న ఆ పార్ట్ టైం ఉద్యోగిని విధుల నుంచి తొలగించి సచివాలయం ఉద్యోగ్యుల్ని నియమిస్తే జగ్గంపేట ప్రజలకు మేలు చేసిన వారు అవుతారని పలువురు అంటున్నారు.

ఫిబ్రవరి 11న జంతర్‌మంతర్‌లో ఎల్‌ఐసీ ఏజెంట్ల ధర్నా

విజయవంతం చేయాలని పిలుపు

విశాలాంధ్ర - అమలాపురం : లైఫ్ ఇన్సూరెన్స్ ఏజెంట్స్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇం డియా ఎల్ఐసి ఎఒఐ మొదటి సంవత్సరం సర్వసభ్య సమావేశం లైఫ్ ఇన్సూరెన్స్ ఏజెం ట్స్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా సర్వసభ్య సమావేశం బుధవారం అమలాపురం యూని యన్ అధ్యక్షులు సానబోయిన వీరభద్రరావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి రాజమండ్రి డివిజన్ ఎఒఐ యూనియన్ అధ్యక్షులు వై విశ్వేశ్వరరావు విచ్చేసి ఎల్ఐసి స్థాపించినప్పటి నుండి ఇప్పటివరకు 58 డిమాండ్లను సాధించిందని ఆయన వివరించారు. ముఖ్య అతిథి వి నాగిరెడ్డి డివిజన్ సెక్రెటరీ విచ్చేసి రానున్న ఫిబ్రవరి 11న జరుగు ధర్నాను ఢిల్లీ జంతర్ మంతర్ దగ్గర విజయవంతం చేయాలని అమలాపురం నుండి అధిక సంఖ్యలో ఏజెంట్ పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం ఈ సమావేశంలో కార్యవర్గం అంత ఫిబ్రవరి 11 ధర్నాకు ఏకగ్రీవంగా తీర్మానం చేసినారు. అలాగే ఈ మధ్యనే లైఫ్ ఇన్సూరెన్స్ మార్పులు గురించి చర్చించుకున్నారు. ఈ సమావేశంలో బ్రాంచ్ సెక్రెటరీ గుమ్మలూరి వినాయకరావు, ట్రెజరర్ దొమ్మేటి శివ స్వామి, ఉపాధ్యక్షులు శీలం లంకేశ్వరుడు, కొరమిల్లి మధు, ఆర్గనైజేషన్ సెక్రటరీ అయినవిల్లి నాగేంద్ర కుమార్, జాయింట్ సెక్రెటరీ నాగభూషణం, ఈసీ మెంబర్ లక్కింశెట్టి వరలక్ష్మి, ఎడ్ల ఆదినారాయణ, కొప్పుల సతీష్, అధికారపు బాబ్జి, యనమదల శ్రీనివాసరావు, గుమ్మల గణేష్, కాంద్రేగుల నరసింహ శెట్టి, మట్టపర్తి ఏసుదాసు, కడలి నాగప్రసాద్, బొక్క వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అరుణ తోరణాలతో భీమవరం

విశాలాంధ్ర - భీమవరం : సీపీఐ శతవార్షికోత్సవం సందర్భంగా భీమవరం పట్టణంలో కోర్ట్, ప్రకాశం చౌక్ కూడలిలో సీపీఐ తోరణాలు, జెండాలతో అలంకరించారు. అలంకరణలో సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు, జిల్లా కార్యవర్గ సభ్యులు చెల్లబోయిన రంగారావు, ఎం.సీతారాంప్రసాద్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ స్టేట్ ఆర్గనైజింగ్ కార్యదర్శి కిలారి మల్లేశ్వరరావు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు ధనాల అప్పారావు, రౌతు వెంకటేశ్వర్లు, రౌతు పీర్ బాబు, మాడుగుల గణేష్ పాల్గొన్నారు.

నారాయణ స్కూల్‌ను బంద్ చేయించిన ఏఐఎస్‌ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకులు

విశాలాంధ్ర - రాజోలు : క్రిస్మస్ పండగ సందర్భంగా ప్రభుత్వం సెలవు ప్రకటించినప్పటికి శివకోడు నారాయణ స్కూల్ విద్యార్థులకు తరగతులు నిర్వహిస్తుండటంతో బుధవారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నారాయణ స్కూలును బంద్ చేయించారు. క్రిస్మస్ పండగ జరుగుతున్న తరుణంలో కూడా స్కూలు పెట్టడం పట్ల ఏఐఎస్ఎఫ్ నాయకులు తీవ్ర ఆందోళనను వెలిబుచ్చారు. విద్యాశాఖ అధికారులు నిర్లక్ష్యం వల్లే ఇలాంటి తప్పిదాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఇప్పటికైనా మండల విద్యాశాఖ అధికారులు సెలవుల్లో కూడా స్కూల్ నడుపుతున్న యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని సూచించారు. స్కూల్ అనుమతులు రద్దు చేయలని ఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. విద్యా శాఖ అధికారులు తక్షణమే నారాయణ స్కూల్ యాజమాన్యం పై చర్యలు తీసుకోవాలని కోరారు. లేనిపక్షంలో రాజోలు నారాయణ విద్యాసంస్థల ముందు పెద్దఎత్తున ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమాన్ని ఏఐఎస్ఎఫ్ రాజోలు మండల అధ్యక్షుడు ఉండ్రు. ప్రశాంత్, ఉదయరామరాజు ఏఐవైఎఫ్ రాజోలు నియోజకవర్గ కన్వీనర్ వై వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ విలువలు కలిగిన నేత వాజ్‌పేయి

విశాలాంధ్ర - మామిడికుదురు : రాజకీయ విలువలు కలిగిన నేత వాజ్ పేయి అని మాజీ ఎమ్మెల్యే ఎంఎ వేమా కొనియాడారు. అటల్ బిహారీ వాజ్ పేయి 100వ జయంతి సందర్భంగా మామిడికుదురు సెంటర్లో ఆయన చిత్రపటానికి పూలమాలవేచి నివాళులర్పించారు. మగటపల్లిలో వాజ్ పేయి సేవా సమితి అధ్యక్షులు నక్క త్రిలోచనారావు ఆధ్వర్యంలో వాజ్ పేయి చిత్రపటానికి జడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు పూలమాల వేచి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సంచార జాతులకు, విద్యార్థులకు పండ్లు పెన్నులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పసుపులేటి మహాలక్ష్మి రావు, వేగి వెంకటేశ్వరరావు, కంకిపాటి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు .